సారూ... దీన్ని రోడ్డంటారా !

- పాడైపోయిన మాంబట్టు పారిశ్రామికవాడ రోడ్డు

తడ, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త : నిత్యం వేలమంది కార్మికులు, వందల సంఖ్యలో వాహనాలు తిరిగే మాంబట్టు పారిశ్రామికవాడ రోడ్డు పాడైపోయింది. ఇటు ఆర్‌అండ్‌బి శాఖ వారు గాని అటు ఏపీఐఐసీ వారు గాని ఈ రోడ్డును పట్టించుకోవడం మానేశారు. పదివేల మందికి పైగా కార్మికులు ఉన్న అపాచీ షూ తయారీ కేంద్రంతో పాటు మరెన్నో పరిశ్రమలు ఈ మార్గంలో స్థాపించి ఉన్నారు. కొండూరు, కాదలూరు, మాంబట్టు, వెండ్లూరుపాడు వంటి పంచాయతీలకు ఇదే ప్రధాన రహదారి పరిశ్రమలకు చెందిన వందలాది వాహనాలు ఈ రోడ్డులో దుమ్ము కొట్టుకుంటూ వెళుతున్నాయి. ఎండలు సమీపించిన కారణంగా దుమ్ము రేగిన రోడ్డుపై వెళ్లడం కష్టంగా మారిందని ద్విచక్ర వాహనదారులు గోడుమంటున్నారు. చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి నుంచి కొండూరు వద్ద మొదలయ్యే ఈ రోడ్డు వరదయ్యపాలెం మండలం దాకా ఉంటుంది. అయితే మధ్యలో అనేక పల్లెలు దుమ్ముధూళితో కొట్టుమిట్టాడుతున్నాయి. కార్మికులు కరోనా తగ్గినప్పటికీ మాస్కులు వేసుకొని పయనిస్తున్నారు. కోట్లు సంపాదిస్తున్న పారిశ్రామికవేత్తలు గాని, గ్రావెల్ వంటివి తరలిస్తూ లక్షలు ఆర్జిస్తున్న అధికార పార్టీ నేతలు గాని ఈ రోడ్డు దుస్థితిని పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మాంబట్టు పారిశ్రామికవాడ రోడ్డులో గతంలో గుంతలను అక్కడక్కడా పూడ్చి మళ్లీ అటువైపు చూడలేదని పలు గ్రామాల ప్రజలు చెప్తున్నారు. ఇటీవల కొన్ని చోట్ల కల్వర్టులు కూడా కొట్టుకు పోయినప్పటికీ వాటిని పటిష్టపరచక పోవడం ఇప్పటికీ కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ రోడ్డుపై కళ్లు తెరిచి ప్రయాణించాలంటే సాధ్యం కావడం లేదని, దుమ్ము కారణంగా పరిశ్రమలకు వెళ్లి వచ్చే సరికి తెల్లబడి పోతున్నామని పలువురు కార్మికులు పేర్కొన్నారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల పరిశీలన పూర్తి

- స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా సిపాయి సుబ్రమణ్యం ఏకగ్రీవం - పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుండి 23 - ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం నుండి 8 మంది పోటీ - పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంకు సంబంధించి 7 నామినేషన్లు తిరస్కరణ

నామినేషన్లను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి, కలెక్టర్

చిత్తూరు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల పరిశీలన శుక్రవారం పూర్తి అయ్యింది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం నుండి అధికార వైకాపా అభ్యర్థి సిపాయి సుబ్రమణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ స్థానం నుండి పోటీ చేయడానికి నామినేషన్ దాఖలు చేసిన చుక్కా ధనంజేయులు నామినేషన్‌ను నామినేషన్ల పరిశీలనలో ఎన్నికల అధికారులు తిరస్కరణకు గురికావడంతో వైకాపా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి సిపాయి సుబ్రమణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక సంస్థల నామినేషన్ల పరిశీలన కార్యక్రమం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు, ఎపి ట్రాన్స్‌కో సిఎండి శ్రీధర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో జరిగింది. అలాగే పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు దాఖలు అయిన నామినేషన్లను ఎన్నికల పరిశీలకులు ఎస్‌హెచ్ కాటమనేని భాస్కర్, కోనా శశధర్, కలెక్టర్, రిటర్నింగ్ అధికారి హరినారాయణన్‌ల నేతత్వంలో పరిశీలించారు. ఈ నామినేషన్ల పరిశీలనలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంకు దాఖలైన 8 నామినేషన్లు అమోదం పొందాయి. అలాగే పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి మొత్తం 30 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తే వీటి పరిశీలన అనంతరం ఏడు మంది అభ్యర్థుల నామినేషన్లు తిర్కరణకు గురైనట్లు ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికల బరిలో ప్రస్తుతం 23 మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 27వ తేదీ వరకు గడువు వుండటంతో ఆపై ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఎన్నికల పోటీలో మిగిలి వున్న అభ్యర్థుల తుది జాబితాను విడుదల చేయనున్నారు.

మార్పు రాకుంటే... ఊరుకోను!

-పదవుల కోసం కాదు.. పార్టీకోసం పనిచేసే వారికి గౌరవిస్తా
-బాదుడేబాదుడుతో గట్టిగా ప్రజల్లోకెళ్ళండి
-తిరుపతి నేతలకు యువనేత లోకేష్ క్లాస్

తిరుపతి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులతో సమీక్ష నిర్వహిస్తున్న నారా లోకేష్

తిరుపతి,ఫిబ్రవరి 24ప్రభాతవార్త: పార్టీ పేరు చెప్పుకుని పనిచేయకుంటే చూస్తూ ఊరుకోను... పదవులు తీసుకోవడం కాదు, ఆ పదవులకు న్యాయం చేయండి... పార్టీ కోసం పనిచేసే వారికి గౌరవమిస్తా... కథలు చెబితే అధినేత చంద్రబాబులాగా సాగదీయను... చర్యలు ఉంటాయంటూ టిడిపి యువనేత, జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ తిరుపతి నేతలకు గట్టిగా హెచ్చరించారు. ఆషామాషీగా తీసుకుంటే మార్పుచేస్తా... పార్టీ భవిష్యత్తుకోసం నాతో కలసి నడవండి అంటూ నిర్దేశం చేశారు. 28 రోజుల పాదయాత్రలో ప్రజలతో మమేకమై, వారి సమస్యలు వింటున్నా, పరిష్కరిస్తున్నా... పార్టీని నమ్ముకున్న ప్రజలకు కొంతఅయినా న్యాయం చేయాలని సుతిమెత్తగా క్లాస్ తీసుకున్నారు. ప్రజా సమస్యలు పట్టించుకోకుండా, వారికి అందుబాటులో లేకుండా పదవులు కోసం ఆధిపత్యపోరు సాగిస్తే ఎవరికైనా ఒకే సమాధానం ఉంటుందని గట్టిగా తేల్చేశారు. రాష్ట్రప్రభుత్వ వైఖరిపై, వ్యతిరేకతపై బాదుడేబాదుడు కార్యక్రమాన్ని ఆషామాషీగా తీసుకుని పనిచేశారని దీనివల్ల ఒరిగిందేమీ లేదని అన్నారు.వైసిపి ప్రభుత్వంపై, నాయకుల తీరుపై ప్రజల్లోకెళ్లి ఎందుకు గట్టిగా పోరాటం చేయడంలేదని నేతలను నిలదీశారు. పార్టీకి ప్రాణసమానులుగా పనిచేసే వారికి పదవులు వస్తాయని, పదవుల కోసం పనిచేయొద్దని లోకేష్ నిర్మొహమాటంగా అభిప్రాయం వ్యక్తం చేయడంతో చాలామంది నాయకులకు మింగుడుపడలేదు. తిరుపతిలో నాయకులు, కార్యకర్తలు కలసి పనిచేయాలని, ఇదే ధోరణితో ఉంటే పనిచేసే వారిని తీసుకువచ్చి, ప్రోత్సహించే పరిస్థితి వస్తుందన్నారు. తిరుపతిలో నాయకుల మధ్య ఆధిపత్యపోరు నడుస్తోందని, నాయకులు కొట్టుకుని పార్టీకి చెడ్డపేరుతోబాటు ప్రజల్లో చులకన చేస్తున్నారని మండిపడ్డారు. యువగళం పాదయాత్రలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం రేణిగుంట రోడ్డులోని శిబిరంలో తిరుపతి నియోజకవర్గ నాయకులతో యువనేత లోకేష్ ప్రత్యేకంగా సమీక్ష చేశారు. తిరుపతిలో టిడిపికి బలమైన ఓటు బ్యాంకు ఉందని, ఇంతమంది నాయకులు పదవుల్లో ఉండి ఏమి చేస్తున్నారని తనదైన శైలిలో ప్రశ్నించారు. ఎవరూ కూడా ఆషామాషీగా తీసుకోవద్దని, రాబోయే రోజులు కీలకమని, పార్టీ కోసం అందరూ కలసిపనిచేయాలని చివరగా హితవు చేశారు. పనిచేసే వారికి పదవులు ఇస్తానని, రానున్న ఎన్నికల్లో తిరుపతిలో పార్టీ గెలుపు అవసరం అన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ తగిన కార్యాచరణతో సైనికుల్లా పనిచేయండని లోకేష్ సూచించారు. సమీక్షలో తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేయడంతో, శనివారం (నేడు)సాయంత్రం జరగనున్న పాదయాత్ర విజయవంతంపై నాయకులందరూ డివిజన్లలో తిరగడం కనిపించారు. ఇదిలా ఉండగా పాదయాత్ర ముగిసేలోపు తిరుపతిపై యువనేత మరింత ప్రత్యేక దృష్టి సారిస్తారని పార్టీ శ్రేణుల్లో బలంగా వినిపిస్తోంది. ఈ సమీక్షలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి, టిడిపి నాయకుడు బోండా ఉమ, తిరుపతి ఇన్‌ఛార్జి ఎం.సుగుణమ్మ, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నరసింహయాదవ్, జాతీయ, రాష్ట్ర కమిటీ నాయకులు మబ్బుదేవనారాయణరెడ్డి, సూరాసుధాకర్‌రెడ్డి, వి.పుష్పావతియాదవ్,బి.శ్రీధర్‌వర్మ, కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ, బుల్లెట్ రమణ, దంపూరి భాస్కర్‌యాదవ్, ఊకా విజయకుమార్, బిజి కృష్ణయాదవ్, ఊట్ల సురేంద్రనాయుడు, కుమారమ్మ, రుద్రకోటి సదాశివం, వెంకీ,మునిశేఖర్ రాయల్, నగరకమిటీ అధ్యక్షుడు వట్టికుంట శంకర నారాయణ, కార్యదర్శి మహేష్‌యాదవ్, యువనేతలు, 50డివిజన్ల అధ్యక్ష,కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా సూళ్లూరుపేట శ్రీచెంగాళమ్మ...

కుంభాభిషేక మహోత్సవం

కలశ స్థాపన చేస్తున్న దృశ్యం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళ మాతా పరమేశ్వరి దేవస్థానంలో గత రెండురోజులుగా జరుగుతున్న మహాకుంభాభిషేక మహోత్సవం శుక్రవారం నూతనంగా సువర్ణ తాపడంతో అమ్మణ్ణి శిఖర గోపురంపై ప్రతిష్ఠించిన కలశాలతో వైభవంగా ముగిసింది. గత రెండురోజులుగా లక్షకుంకు మార్చనలు, కలశాభిషేకాలు, ప్రత్యేక పూజలు, హోమాలు, వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించి శుక్రవారం మధ్యాహ్నం ఆలయ శిఖర గోపురం మీద కలశ స్థాపన వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య చేపట్టారు. ఈ సందర్భంగా ఉభయదాతలు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతి దంపతులు, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య దంపతులు, ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డి దంపతులు కలశాలకు పరిశుద్ధ జలాలతో పూజలు చేసి, వాటిలో పవిత్ర జలాన్ని నింపిన అనంతతరం కలశ ప్రతిష్ఠ నిర్వహించారు. భక్తులు కలశ స్థాపన మహోత్సవాన్ని తిలకించేందుకు పెద్దసంఖ్యలో దేవస్థానానికి చేరుకున్నారు. కుంకు మార్చనలో పాల్గొనడంతో పాటు హోమం జరుగుతున్న యాగశాలకు వెళ్లి దర్శించుకొని మధ్యాహ్నం 1 గంట వరకు కలశ స్థాపన మహోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిష్ఠాపన అనంతరం పవిత్ర జలాన్ని శిరస్సు పై చల్లే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సరైన ఏర్పాట్లు లేకపోవడంతో భక్తులు పవిత్ర జలాల్ని చల్లించుకునేందుకు ఒక్కసారిగా ఎగబడ్డారు. దీంతో కొద్దిపాటి తొక్కిసలాట జరిగినా ఎటువంటి అపశృతి చోటు చేసు కోలేదు. మరోవైపు పోలీసులు భారీ సంఖ్యలో బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నియంత్రించడంతో పాటు భక్తులను కట్టడి చేసేందుకు ప్రయత్నించారు. ఊహించిన దాని కంటే భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో వారికి మంచినీటి సదుపాయం అంతంత మాత్రంగానే ఉండటంతో ఎండవేడిమిని తట్టుకోలేక అవస్థలు పడ్డారు. మహాకుంభాభిషేక మహోత్సవం విజయవంతం కావడంతో దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, కార్యనిర్వహణ అధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డి సహకరించిన పాలక మండలి సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగేందుకు సహకరించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులకు, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య దంపతులకు, దాతలకు ధన్యవాదాలు తెలిపారు. మొత్తంమీద మూడురోజుల పాటు జరిగిన మహాకుంభాభిషేక మహోత్సవం అట్టహాసంగా జరగడంతో పాటు నిర్విఘ్నంగా ముగియడంతో ఈ ప్రాంత ప్రజలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు.

కుంభాభిషేకంలో పాల్గొన్న భక్తులు

అలిగిన వేళనే... చూడాలి!

కన్నుల పండువగా కైలాసనాధుని పల్లకి సేవ

(శ్రీకాళహస్తి ప్రభాతవార్త)

శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి పల్లకి సేవ అంగరంగ వైభవంగా నిర్వహి ంచారు.శివరాత్రి బ్రహ్మోత్స వాల్లో చివరి గ్రామోత్సం పల్లకిసేవ. ఈ సేవకు గతంలో ఎంతో ప్రాముఖ్యత ఉండేది. రాను రాను ఉత్సవాలు మొక్కుబడిగా ఊరేగింపులకే పరిమితమౌ తున్న దశలో పల్లకి సేవ కూడా స్థానికులకే పరిమితమైంది. అయితే ఉత్సవాలను సమయపాలనతో ఈ ఏడాది నిర్వహించటంతో స్థానికులు అత్యధిక సంఖ్యలో దర్శించుకునే భాగ్యం లభించింది.

అలిగిన వేళనే చూడాలి...

అలిగిన అమ్మవారిని బుజ్జగిస్తూ, ప్రాధేయపడుతూ వెంబడించిన సోమస్కందమూర్తి ఘట్టం భక్తులను ఎంతగానే ఆకట్టుకుంది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో 12వరోజు నిర్వహించే గ్రామోత్సవం పల్లకిసేవ. సాధారణంగా ఎవరైనా అలిగితే, కోపబడితే కళ్ళు ఎర్రబడడం సహజం. మోహం ఎర్రగా మారిపోతుంది. అయితే జగన్మాత అసురసంహారిని అయిన ఆదిశక్తి ఆగ్రహించిన వేళ ఆమెను చూడడం ఎవరికైనా సాధ్యమా? సాహసమా? అందుకే అలిగిన ఆదిశక్తి ముందు పల్లకిలో వెళ్ళగా ఆమెను బుజ్జగిస్తూ సోమస్కందమూర్తి అయిన శ్రీకాళహస్తీశ్వరుడు వెంబడించడం పల్లకి సేవ పరమార్థం. ఈ ఘట్టం శ్రీకాళహస్తీశ్వరాలయం జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి కైలాసనాధుని పల్లకి ఉత్సవం అంగరంగవైభవంగా కన్నుల పండువగా నిర్వహించారు.ఈ ఉత్సవాన్ని తిలకించుటకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు. దాంతో నాల్గుమాడావీధుల్లో ఎటు చూసినా ఇసుకేస్తేరాలనంత రద్దీ ఏర్పడింది. మహాశివరాత్రి ఉత్సవాల్లో అత్యంత శోభాయమానంగా నిర్వహించే ఉత్సవాల్లో పల్లకి సేవ ఒకటి.ఈ ఉత్సవాన్ని స్థానిక ఉత్సవంగా నిర్వహిస్తారు. శుక్రవారం సాయంత్రం ఆలయంలోని అలంకార మండపంలో సోమాస్కందమూర్తి అయిన శ్రీకాళహ స్తీశ్వరుని ఓ పల్లకిలో ముస్తాబు చేశారు. అలాగే మరో పల్లకిలో దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారిని చక్కగా అలంకరించి ప్రతిష్టించారు.స్వామి వారి పల్లకిలో అద్దం ఏర్పాటు చేశారు. ముందు స్వామి వారి పల్లకి వెళుతుండగా వెనుక అమ్మవారి పల్లకి సాగింది. అద్దంలో అమ్మవారి తేజస్సును దర్శించుకుంటూ స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామోత్సవాల్లో ఇది చివరి ఉత్సవం కావటంతో భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు.బోయిలు స్వామి అమ్మవార్ల పల్లకీల్ని మోసుకుంటూ వెళుతుండగా భక్తులు హారతులిస్తూ ముందుకు సాగించారు. స్వామి అమ్మవార్లను అలంకార గురుకుల్ రాజేష్, సూరిబాబులు ముస్తాబు చేయగా ఉత్సవాన్ని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు,ధర్మకర్తల మండలి సభ్యులు, ప్రత్యేకాహ్వానితులు, ఆలయ ఇఓ వి కె సాగర్‌బాబు ప్రాంభించారు. ఇఇ మురళీకృష్ణారెడ్డి, డిఇఇ శ్రీనివాసులురెడ్డి, డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి ఎఇఓ సతీష్‌మాలిక్, అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున్ ప్రసాద్, ఉత్సవాల ఇన్‌చార్జి లోకేష్‌రెడ్డి,టెంపుల్ ఇన్స్పెక్టర్లు హరియాదవ్, సుదర్శనం, నాగభూషనం యాదవ్ పర్యవేక్షించారు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా...

సిపాయి సుబ్రమణ్యం ఏకగ్రీవం

స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన సిపాయి సుబ్రమణ్యం

చిత్తూరు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా అధికార వైకాపా అభ్యర్థి సిపాయి సుబ్రమణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడానికి వైకాపా అభ్యర్థి సిపాయి సుబ్రమణ్యంతో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థిగా చుక్కా ధనంజేయులు నామినేషన్ దాఖలు చేశారు. వైకాపా అభ్యర్థి 4 సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా, ఇండిపెండెంట్ అభ్యర్థి చుక్కా ధనంజేయులు రెండు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు, ఎపి ట్రాన్స్‌కో సిఎండి శ్రీధర్ ఆధ్వర్యంలో శుక్రవారం నామినేషన్ల పరిశీలన కార్యక్రమం జరిగింది. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నామినేషన్ల పరిశీలనకు నామినేషన్లు దాఖలు చేసిన ఇద్దరు అభ్యర్థులు స్వయంగా హాజరు కావాల్సివుంది. అయితే ఇండిపెండెంట్ అభ్యర్థి చుక్కా ధనంజేయులు ఈ కార్యక్రమంకు గైర్హాజరై తనచే నామినేట్ కాబడిన న్యాయవాదులు, ప్రతినిధులు నామినేషన్ల పరిశీలనకు హాజరయ్యారు. ఇండిపెండెంట్ అభ్యర్థి చుక్కా ధనంజేయులు దాఖలు చేసిన రెండు నామినేషన్ పత్రాలతో పాటు నిబంధనలు అనుసరించి అభ్యర్థిత్వ నిర్ధారణకు జత చేయాల్సిన దస్తావేజులను నిర్ణీత సమయంలోపు దాఖలు చేయకపోవడంతో చుక్కా ధనంజేయులు దాఖలు చేసిన రెండు నామినేషన్లు తిరస్కరణకు గురైనట్లు అధికారులు పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఇద్దరు మాత్రమే నామినేషన్లు దాఖలు చేయడం నామినేషన్ల పరిశీలనలో ఇండిపెండెంట్ అభ్యర్థి చుక్కా ధనంజేయులు నామినేషన్ తిరస్కరణకు గురి కావడంతో అధికార వైకాపా అభ్యర్థి సిపాయి సుబ్రమణ్యం ఏకగ్రీవంగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నియ్యారు. ఎన్నికల అధికారులు ఈ ఎన్నికను ఇక అధికారికంగా ప్రకటించాల్సివుంది.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు

- పోలింగ్ విధులకు 2 వేల మంది సిబ్బంది - 5 జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకొని సమర్ధవంతంగా ఎన్నికల విధులు
- కలెక్టర్, ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరినారాయణన్

చిత్తూరు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: ప్రశాంత వాతా వరణంలో ఉపాధ్యాయ, పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పక్కాగా నిర్వహించడానికి అవసరమై అన్ని ఏర్పాట్లను చేపట్టినట్లు కలెక్టర్, ఉపాధ్యా య, పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరినారాయణన్ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టర్ హరినారాయణన్ కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ఫిబ్రవరి 16న నోటిఫికేషన్ విడుదల చేశామని, 23వ తేదీ వరకు అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరించడం జరిగిందని, శుక్రవారం నామినేషన్ల పరిశీలన ప్రక్రియను పూర్తి చేయడం జరిగిందన్నారు. పట్టభద్రుల నియోజకవర్గంకు సంబంధించి ఆరు జిల్లాల పరిధిలో 3.83 లక్షల మంది ఓటర్లు వున్నారని, పోలింగ్ నిర్వహణ కోసం 320 పోలింగ్ స్టేషన్లు, 133 అదనపు పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 27 వేల మంది ఓటర్లు వున్నారని, ఇందుకోసం 170 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ నెల 16వ తేదీ నుండి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైందని, చిత్తూరు జిల్లాతో పాటు మరో ఐదు జిల్లాల్లో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆయా జిల్లాలోని కలెక్టర్లు, డిఆర్‌ఓలు, ఆర్డీఓలు ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఏర్పాట్లు చేపడు తున్నారన్నారు. నామినేషన్ల పరిశీలన అనంతరం పట్టభద్రుల నియోజకవర్గానికి 23మంది అభ్యర్థులు, ఉపాధ్యాయుల నియోజకవర్గానికి 8 మంది అభ్యర్థులు నిలిచార న్నారు. ఈ నెల 27వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ వుంటుందని, అనంతరం ఎన్నికల బరిలో మిగిలిన అభ్యర్థుల తుది జాబితా విడుదల చేస్తామన్నారు. ఈ ఎన్నికలు పేపర్ బ్యాలెట్ సిస్టంలో జరుగుతాయని, ఇందుకు సంబంధించి బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ ఎన్నికల్లో 2 వేల మంది సిబ్బంది విధుల్లో పాల్గొనను న్నారని అన్నారు. వీరందరికి రెండు విడతల ఎన్నికల శిక్షణ ఇవ్వడం జరుగు తుందన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ ఎన్నికల సజావు నిర్వహణ కోసం నోడల్ అధికారుల నియామకం చేపట్టడం జరిగిందన్నారు. ఈ ప్రక్రియ ఆరు జిల్లాల్లో కొనసాగుతుందని, అందరి సహకారంతో ఎమ్మెల్సీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించి పూర్తిచేస్తామని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు.

బ్యాంకర్లు వందశాతం ఋణాలు అందించాలి

-జాయింట్ కలెక్టర్

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: జిల్లా వార్షిక ఋణ ప్రణాళిక మేరకు బ్యాంకర్లు వందశాతం ఋణాలు మంజూరు చేయాలని జాయింట్ కలెక్టర్ డి.కె.బాలాజీ సూచించారు. శుక్ర వారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా సంప్రదింపుల కమిటీ (డి.సి.సి) త్రైమాసిక సమీక్ష సమావేశం చైర్మెన్, కలెక్టర్ ఆదేశాల మేరకు జాయింట్ కలెక్టర్ లీడ్ బ్యాంక్ కన్వీనర్ యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సహకరాంతో జిల్లా అధికారులతో, ప్రభుత్వ, ప్రవేట్ బ్యాంకర్లతో వార్షిక ఋణ ప్రణాళిక అమలుపై సమీక్ష నిర్వహిం చారు. జె.సి. మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాలలో ఋణాలు మంజూరు త్రైమాసానికి 131 శాతంగా ఉందని, అభినందదగ్గ విషయం అన్నారు. ఎం.ఎస్.ఎం.ఈ.లకు సంబంధించి బ్యాంకర్లు దృష్టి పెట్టాలని, 44 బ్రాంచ్‌లు ఉన్న కెనరా బ్యాంకు 32 శాతం, 13 బ్రాంచ్‌లు ఉన్న ఐ.ఓ.బి.13శాతం మంజూరు చేసారని, మార్చి 2023 ఆఖరుకు వందశాతం పూర్తి చేయాలన్నారు. విద్యా ఋణాలకు సంబంధించి జిల్లాలోని ప్రవేట్, ప్రభుత్వ బ్యాంకులు కలిపి 57 శాతం మాత్రమే మంజూరు చేసారని, విద్యకు ప్రాధాన్యతను ఇచ్చి అవగాహన కల్పించి లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. పి.ఎం. స్వానిధి, ఫిష్ ఆంధ్ర పథకాలకు ఋణాలు మంజూరు చేయాలన్నారు. ప్రధానంగా గూడూరు వద్ద టిడ్కో గృహాల ఋణాలను సంబంధించి ఎస్.బి.ఐ నందు 44, బి.ఓ.బి నందు 25 పెండింగ్ ధరఖాస్తులు ఉన్నాయని, ఇవి స్థిరాస్తులు మీ వద్ద ఉంచుతారన్నారు. బ్యాంకర్లు త్వరగా మంజూరు చేయాలని సూచించారు. పాడి పశువులకు, డెయిరీ, ఫుడ్ ప్రొడక్టులకు సంబంధించి ఋణాల మంజూరుకు సహకారం అందించాలని, ఈ పథకాలు కూడా పి.ఎం. స్వానిధి క్రిందికి వస్తుందన్నారు. జిల్లా ఎస్.పి. ఆదేశాలతో సంబంధిత సైబర్ క్రైం బ్రాంచ్ అధికారులు వివరిస్తూ జిల్లాలో 628 కేసులు నమోదయ్యాయని తెలిపారు. దాదాపు రూ.29కోట్ల రుపాయాలు బ్యాంకుల వద్ద ఫ్రీజింగ్ చేశారన్నారు. వాటికి సంబంధించి మీ పరిధిలో బాధితులకు త్వరగా రీయంబర్స్‌మెంట్ జరిగేలా పోలీసు అధికారులకు సహకారంతో జరిపిన కార్యక్రమాలకు ఎస్.పి. పరమేశ్వరరెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయనున్నామని తెలిపారు. ఈ సమీక్షలో లీడ్ బ్యాంకు మేనేజర్ ఆర్.సుబాష్, ఆర్.బి.ఐ ప్రతినిధి పూర్ణిమ, యూనియన్ బ్యాంకు ఆర్.ఎం. రామ్‌ప్రసాద, ఇండియన్ బ్యాంక్ డిజిఎం అరుణ, నాబార్డ్ డిడిఎం సునీల్, ఎస్‌జిబి ఆర్ఎం జయకుమార్, ఎపిజిబి ఆర్ఎం శైలేంద్రనాథ్, ప్రభుత్వ, ప్రవేట్ బ్యాంకుల జిల్లా కో- ఆర్టినేటర్లు, జిల్లా సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు

- ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు కోనా శశిధర్, కాటమనేని భాస్కర్‌లు

చిత్తూరు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను చేపట్టి పూర్తి చేయాలని ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు కోనా శశిధర్, కాటమనేని భాస్కర్‌లు అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వీరు కలెక్టర్ హరినారాయణన్ ఎస్పీ రిశాంత్‌రెడ్డిలతో సమావేశమై ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఎన్నికల పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికల్లో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పూర్తి బందోబస్తును ఏర్పాటు చేయాలని ఎస్పీ రిశాంత్‌రెడ్డిని ఆదేశించారు. అలాగే పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా డిఆర్‌ఓ

రాజశేఖర్ వ్యవహరిస్తున్నారని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం 453 పోలింగ్ స్టేషన్లు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 176 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. ఎన్నికల పోలింగ్‌కు అవసరమైన బ్యాలెట్ బాక్సులను సైతం సిద్ధం చేసుకోవడం జరిగిందని, నోడల్ అధికారుల నియామకం చేపట్టి ఎన్నికలు సజావు నిర్వహణకు అన్ని చర్యలు తీసుకొంటున్నామన్నారు. అలాగే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పరిశీలించడానికి మండల స్థాయిలో టీమ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే ఫ్లయింగ్ స్క్వాడ్, రూట్ ఆఫీసర్లు, సెక్టోరియల్ ఆఫీసర్ల నియామకాలు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే ఎన్నికల నిర్వహణకు సంబంధించి పక్కా బందోబస్తు ఏర్పాటు చేస్తామని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకొంటున్నట్లు ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఎన్నికల పరిశీలకులకు వివరించారు.

బెయిల్ పొందిన తెలుగుదేశం పార్టీ కీలక నేతలు

కుప్పం, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త : కుప్పం తెలుగుదేశం పార్టీకి చెందిన 19మంది నేతలు కుప్పం పోలీస్‌స్టేషన్‌లో బెయిల్ పొందారు. నాలుగు రోజుల క్రితం తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో తెదేపా అధినేత చంద్రబాబునాయుడు పర్యటనను పోలీసులు అడ్డుకున్నారని కుప్పంలోతెదేపానేతలు నిరసన చేపట్టారు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని కమీషనర్ రవిరెడ్డి కుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో తెదేపా నేతలపై కేసులు నమోదైన విషయం విదితమే. శుక్రవారం కుప్పం పోలీస్‌స్టేషన్‌లో తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, చంద్రబాబు కార్యదర్శి మనోహర్‌లు సంతకాలు చేసి స్టేషన్ బెయిల్ పొందారు.

వాహనాల వేలంతో 1.54లక్షల ఆదాయం

శాంతిపురం, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :

వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన 8 టువీలర్లు, ఓ ఆటో బహిరంగవేలంద్వారా ప్రభుత్వానికి రూ 1,54580ల ఆదాయం లభించింది. జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆదేశాలతో శుక్రవారం సెబ్ అసిస్టెంట్ సూపరింటిండెంట్ ఆయేషా బేగం అధ్వర్యంలో రాళ్లబూదుగూరు పిఎస్‌లో వాహనాల వేలం నిర్వహించారు. సెబ్ సిఐ కిషోర్‌కుమార్, ఎస్సై మునస్వామి పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర బిజెపి చీఫ్ సోము వీర్రాజు కుప్పం పర్యటన

కుప్పం, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు శనివారం కుప్పంలో పర్యటిస్తారని రాష్ట్ర బిజెపి కౌన్సిల్ సభ్యుడు శివశంకర్ తెలిపారు. పలమనేరు నియోజకవర్గంలో భాజపా ఎమ్మెల్సీ అభ్యర్థి దయాకర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించిన అనంతరం సాయంత్రం 4గంటలకుసోమువీర్రాజు కుప్పంలోని భాజపా కార్యాలయంకు చేరుకుంటార న్నారు. కుప్పంలో సైతం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశమవుతారని పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

రేపు సంగీత ధ్యాన కచేరి

చిత్తూరురూరల్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: కాణిపాకం సమీపం, అరగొండ క్రాస్, సిద్దంపల్లె వెలసిన శ్రీ విఘ్నేశ్వర మహాపిరమిడ్ శక్తిక్షేత్రం నందు అన్నమయ్య వంశానికి చెందిన వారసులు షణ్ముఖ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేది ఆదివారం ఉదయం సంగీతధ్యాన కచేరి నిర్వహిస్తున్నట్లు చిత్తూరు జిల్లా పిరమిడ్స్ సొసైటీ, గ్లోబల్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ బి.గోపాలక్రిష్ణమూర్తి తెలిపారు. అలాగే మధ్యాహ్నం ట్రస్ట్ కన్వీనర్, సీనియర్ పిరమిడ్ మాస్టర్ శ్రీమతి రాధిక గోపాలక్రిష్ణ చే ఆత్మజ్ఞాన బోధన కార్యక్రమం వుంటుందన్నారు. ధ్యానులు, సంగీతాభిలాషులు పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని ఆయన కోరారు.

గంగమ్మకు అరుదైన పుంగనూరు జాతి ఆవు బహూకరణ

బోయకొండ(చౌడేపల్లి), ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :

శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ గోశాలకు పుంగనూరుజాతి ఆవును బహూకరించారు. చౌడేపల్లికి చెందిన పిల్లారి ఏజెన్సీస్ అధినేత పిల్లారి జీవన్ ప్రకాష్ అరుదైన పుంగనూరు జాతి ఆవును అమ్మవారి గోశాలకు ఛేర్మన్ మిద్దింటి శంకరనారాయణ, ఇఓ చంద్రమౌళి సమక్షంలో అందించారు. సంవత్సర కాలంలో గోశాలకు 34పశువులను రైతులు బహూకరిం చారనీ, పశువుల పాలన సంతృప్తికంగా వున్నందునే వారు తమపై నమ్మకంతో బహూకరిస్తున్నారని మిద్దింటి తెలిపారు. ధర్మకర్తల మండలి సభ్యులు పూర్ణిమారాయల్‌మోహన్, యువకావునాడు రాష్ట్ర అధ్యక్షుడు మిద్దింటికిషోర్, యువనాయకులులీలాకుమార్‌నాగ్, మంజు, వెంకటేష్, రాజేష్, ఆలయసిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడుగా నాగరాజ

చౌడేపల్లి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :

చిత్తూరు జిల్లా వైకాపా వాణిజ్య విభాగ అధ్యక్షుడుగా చౌడేపల్లి బజారువీధి నూజిల్ల నాగరాజను నియమించినట్లు ఆయన తెలిపారు. ఈమేరకు రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నుంచి ఆదేశాలు జారీ అయ్యిందన్నారు. తనపై నమ్మకంతో ఇంతటి పదవిని అందించిన మంత్రి పెద్దిరెడ్డి, ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, ధర్మవరం పరిశీలకుడు పెద్దిరెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో పక్కా ఏర్పాట్లు

- ఎమ్మెల్సీ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డిఆర్‌ఓ రాజశేఖర్

చిత్తూరు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పక్కాగా చేపట్టి పూర్తి చేయాలని ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, డిఆర్‌ఓ రాజశేఖర్ సెక్టోరియల్ ఆఫీసర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం డిఆర్‌ఓ రాజశేఖర్ సెక్టోరియల్ ఆఫీసర్లతో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ మాట్లాడుతూ సెక్టోరియల్ అధికారులకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపు, వీల్‌ఛైర్, విద్యుత్, మంచినీరు, మరుగుదొడ్లు, వెబ్ కాస్టింగ్ చేయడానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లను పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు. ఎన్నికల్లో ఓటు వేసే ఓటర్లు ఓటరు స్లిప్పుతో పాటు

రేషన్ కార్డు, ఓటరు కార్డు, ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు, ఎంప్లాయి ఐడి కార్డు, ఎదైనా ఒక గుర్తింపు కార్డుతో వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవచ్చునన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులకు వేరు వేరుగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, పోలింగ్ కేంద్రాలు మండల కేంద్రాల్లో వుంటాయన్నారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతంను పంపించాలన్నారు. 8వ తేదీ నాటికి ఓటరు స్లిప్పులు ఇవ్వడం జరుగుతుందని, మార్చి 1, 9వ తేదీన పిఓలు, ఎపిఓలకు చిత్తూరు పివికెఎన్ డిగ్రీ కళాశాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఓటు వేయడానికి వచ్చిన ఓటర్లకు స్వేచ్ఛ వాతావరణం కల్పించడానికి సెక్టోరియల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిఓలు, ఎపిఓల ఫోన్ నెంబర్లను సెక్టోరియల్ ఆఫీసర్లు వుంచుకోవాలన్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

వార్డుల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి : ఛైర్మన్

కుప్పం, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :

కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధి రాజీవ్ కాలనీ, వడ్డిపల్లిలో జరుగుతున్న డ్రైనేజీ, సిసి రోడ్ల పనులను ఛైర్మన్ పరిశీలించారు. ఇదివరకే సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మంజూరు చేసిన 66 కోట్ల నిధులలో మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డులో రెండు కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. పనుల్లో నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నటుల తెలిపారు. కార్యక్రమంలో కమీషనర్ రవిరెడ్డి, ఆంజనేయగుడి ఛైర్మన్ కుమరేష్, మున్సిపల్ అధికార ప్రతినిధి ఇంతియాజ్, సచివాలయ కన్వీనర్ రాజా తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరకులస్తులకు చంద్రబాబు తీరని ద్రోహం

- రాష్ట్ర వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ పెద్దన్న

కుప్పం, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :

రాష్ట్రంలోని వడ్డెర కులస్తులను తెదేపా అధినేత చంద్రబాబునాయుడు గతంలో తీరని ద్రోహం చేశారని రాష్ట్ర వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ పెద్దన్న పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తాజాగా ఇద్దరు మంది వడ్డెరకులస్తులకు ఎమ్మెల్సీ పదవులు కేటాయించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. వడ్డెర కులస్తులను రాజకీయంగా పైకితెచ్చి ఆదుకుంటోంది వైకాపా ప్రభుత్వమేనన్నారు. కుప్పం నుంచి తనకు ఇదివరకే రాష్ట్రస్థాయి కార్పోరేషన్ పదవి కేటాయించారన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ భరత్‌లు కుప్పంలో వడ్డెరల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. 14 ఏళ్లు సిఎంగా ఉన్న చంద్రబాబు వడ్డెరలను పట్టించుకోలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో వడ్డెర కులస్తులు సిఎం జగన్మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలుస్తామన్నారు. సమావేశంలో సర్పంచులు శ్రీనివాసులు, రవి, ఎంపిటిసి వినాయక, నేతలు వీరభద్ర, వెంకటస్వామి, మణి, రమణ, కృష్ణ, మురుగేష్, మోహన్, రామచంద్ర, గజేంద్ర, రెడ్డెప్ప, చెంగప్ప, వెంకటేష్, మణి, తదితరులు పాల్గొన్నారు.

పేలుడు ధాటికి ఇళ్ల గోడలకు బీటలు...

న్యాయం చేయాలని రైల్వే అధికారులకు వినతి

కుప్పంరూరల్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :

కుప్పం రైల్వే స్టేషన్ పరిధిలో ఉన్న బండరాళ్లను తొలగించేందుకు రైల్వే అధికారులు శుక్రవారం పేలుడు పదార్థాలతో రాళ్లను కొంతమేర తొలగిం చారు. అయితేఈ పేలుడు ధాటికి సమీపంలోని నివాస గృహాల యొక్క గోడలు బీటలు వారాయి. దీంతో సుమారు ఇరవై కుటుంబాల వారు స్థానిక రైల్వే ఇంజనీరింగ్ అధికారులను కలిశారు. తమకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. అసలే కూలీనాలీ పనులు చేసి కుటుంబాలు పోషించుకునే తాము కష్టపడి ఇళ్లు కట్టుకున్నామని అయితే నేడు పేలుళ్ల ధాటికి ఇళ్ల గోడలు బీటలు వాలాయని తమకు తగు న్యాయం చేయాలని కోరారు. దీనిపై రైల్వే ఇంజనీరింగ్ అధికారులు మాట్లాడుతూ ఈ విషయంగా తమకు సంబంధం లేదని బంగారుపేటలో ఉన్న ఉన్నతాధికారులను కలవాలని సూచించారు.

ఆర్టీసీ డిపోలో ఆర్ఎం ఆకస్మిక తనిఖీలు

కుప్పంరూరల్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త : కుప్పం ఆర్టీసీ డిపోలో శుక్రవారం రీజనల్ మేనేజర్ చెంగల్‌రెడ్డి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా డిపో గ్యారేజ్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా డిపో పరిధిలో ఉన్న బస్సుల స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు. అలాగే డిపో పరిధిలో నెలకొన్న సమస్యలను ఆర్టీసీ ఉద్యోగులు ఆర్ఎంకు వివరించారు. సమస్యల పరిష్కారంకు తగు చర్యలు తీసుకుంటామని ఆర్ఎం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిఎం టికె స్వామి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర గవర్నర్‌కు ఘన సన్మానం

కుప్పంరూరల్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త : రాష్ట్ర నూతన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు బెంగళూరు న్యాయ చౌపల్ కోఆర్డినేటర్ రాఘవేంద్ర మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. శుక్రవారం రాష్ట్ర గవర్నర్ ప్రమాణ స్వీకారోత్సవంలో రాఘవేంద్ర పాల్గొన్నారు. అనంతరం గవర్నర్ ఇచ్చిన హైటీ తేనీటి విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. గవర్నర్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

వైభవంగా నాగార్పమ్మ పున:ప్రతిష్ఠ మహోత్సవాలు

కోట, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

కోట మండలం చెందోడు గ్రామంలో వెలసిన నాగార్పమ్మ గ్రామదేవత పున:ప్రతిష్ఠ మహాకుంభాభిషేక మహోత్సవాలు ఘనంగా జరిగాయి. శుక్రవారం పంచామృతాభిషేకం, సుబ్రహ్మణ్యస్వామి, నాగార్పమ్మ హోమం నిర్వహించారు. విగ్రహ పున:ప్రతిష్ఠ కార్యక్రమానికి వందలాది మంది భక్తులు హాజరయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ నిర్వహించింది.

శ్యాంప్రసాద్‌రెడ్డికి విశ్రాంత ఉపాధ్యాయ సంఘం మద్దతు

కోట, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి మద్దతు ప్రకటిస్తున్నట్లు ఉమ్మడి నెల్లూరు జిల్లా విశ్రాంత ఉపాధ్యాయ సంఘం తెలిపింది. శుక్రవారం కోటలో ఁ రామిశెట్టి విలేఖరుల సమావేశంలో మార్చి 13న జరగనున్న ఎన్నికల్లో శ్యాంప్రసాద్‌రెడ్డికి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. విద్యావంతులైన శ్యాంప్రసాద్‌రెడ్డి పేర్నాటి ఛారిటబుల్ ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్నారని చెప్పారు. 2020 తర్వాత పదవీ విరమణ చేసిన వారికి గ్రాట్యుటీ రూ.16 లక్షలు, ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షనర్లకు జీతాలు, డిఎ బకాయిలు చెల్లింపులపై తమ డిమాండ్లు తెలియజేశామన్నారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పివిఎస్ నారాయణరావు పాల్గొన్నారు.

చెంగాళమ్మను దర్శించుకున్న ఉచ్చూరు దంపతులు

ఓజిలి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :

సూళ్లూరుపేట పట్టణంలో వెలసిన శ్రీచెంగాళమ్మ పరమేశ్వరిని కురుగొండ సహకార సంఘం అధ్యక్షురావు, నాయుడుపేట ఎఎంసి ఎక్స్ అఫిషియో సభ్యురాలు ఉచ్చూరు శోభారాణి, వైసీపీ సీనియర్ నాయకులు, మానమాల పంచాయతీ ఉపసరపంచ్ ఉచ్చూరు హరినాథ్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి కుంభాభిషేక వేడుకల్లో పాల్గొని కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య వచ్చే ఎన్నికల్లో మళ్లీ విజయం సాధించాలని ఆలయంలో ప్రత్యేక పూజలు చేసినట్లు వారు తెలిపారు. ఆలయ సిబ్బంది ఉచ్చూరు దంపతులను శాలువాలతో సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలుఅందజేశారు. చెంగాళమ్మ ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డిని ఉచ్చూరు హరినాథ్‌రెడ్డి, శోభారాణిలుశాలువాలతో సన్మానించి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మానమాల గ్రామ ప్రజలు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు వారు తెలిపారు.

భూమికి హద్దులు చూపండి!

ఓజిలి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త : ఓజిలి మండలం పెద్దపరియ గ్రామానికి చెందిన గడితోట పవన్‌కుమార్ తన పొలానికి హద్దులు చూపాలని తహశీల్దార్ డి.లాజరస్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు పవన్‌కుమార్ మాట్లాడుతూ పెదపరియ గ్రామ రెవెన్యూ సర్వే నంబర్ 38లో 9బి 1.29 ఎకరాల భూమి తన తండ్రి గడితోట పోలయ్యకు ప్రభుత్వం అసైన్‌మెంట్ భూమి కేటాయించినట్లు తెలిపారు. తన తండ్రి, తల్లి మృతిచెందడంతో ఈ భూమి తనకు సంక్రమించినట్లు తెలిపారు. ఈ భూమికి హద్దులు చూపాలని రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ ఏడాది జనవరిలో 5వ తేదీన మళ్లీ మరోసారి భూమికి హద్దులు చూపాలని చలానా కట్టానని తెలిపారు. భూమికి హద్దులు చూపితే పొలం చేసుకుంటానని సర్వేయర్లకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. శుక్రవారం వినతిపత్రం పరిశీలించిన తహశీల్దార్ రెవెన్యూ అధికారులను గ్రామానికి పంపి విచారణ చేపట్టి పొలానికి సర్వే చేసి హద్దులు చూపుతామని హామీ ఇచ్చారు.

పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆర్డీఓ

ఓజిలి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త : మార్చి 13వ తేదీన నిర్వహించే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని తెలిపారు. ఓజిలి తహశీల్దార్ కార్యాలయం, విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్‌స్టేషన్‌ను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. పోలింగ్ సిబ్బందికి ఓటు హక్కును వినియోగించుకునే ఉపాధ్యాయ, తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఓటర్లకు కావలసిన వసతుల గురించి పరశీలించారు. తహశీల్దార్ కార్యాలయంలో, విద్యాశాఖ కార్యాలయంలో విద్యుత్ సౌకర్యం, ఇతర సౌకర్యాలు ఉండేలా చూడాలని తహశీల్దార్ డి.లాజరస్‌కు, ఎంపిడిఓ రజనీకాంత్‌కు, ఎంఇఓ శైలజకు సూచించారు. ఆర్డీఓ వెంట తహశీల్దార్ డి.లాజరస్, ఎంపిడిఓ రజనీకాంత్, ఎంఇఓ శైలజ, మండల సర్వేయర్ గోపిరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ మహేష్ తదితరులు ఉన్నారు.

ఎంఎల్‌సీ పోరు రసవత్తరం

కోట, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎంఎల్‌సీ పోరు రసవత్తరంగా మారింది. మరో ఏడాదిలో నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికలు సెమీ ఫైనల్స్‌గా అధికార, ప్రతిపక్షాలు దీన్ని భావిస్తున్నాయి. దీంతో ఈ ఎన్నికను ప్రధాన రాజకీయ పార్టీలైన వైసీపీ, టిడిపి పార్టీలు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నాయి. మరోపక్క గత ఎన్నికల్లో మాదిరిగానే తమ హవా కొనసాగించేందుకు పిడిఎఫ్ సర్వశక్తులు ఒడ్డుతోంది. దీంతో వచ్చే నెల 18న నిర్వహించనున్న ఎంఎల్‌సీ పోరుకు తీవ్ర పోటీ నెలకొంది. గురువారం నాటితో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగియడంతో బరిలో ఉన్న అభ్యర్థులు ఎవరన్నది కూడా ఖరారైంది. తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి స్థానానికి తిరుపతి జిల్లా కోట మండలం అల్లంపాడు గ్రామానికి చెందిన పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి (వైసీపీ) ఇప్పటికే మూడు జిల్లాల్లో 36 నియోజకవర్గాల్లో నాయకులతో ఆత్మీయ పరిచయ కార్యక్రమాల పేరిట ముందుకు దూసుకెళ్లారు. ఆయన పేర్నాటి ఛారిటబుల్ ట్రస్ట్ సేవ పేరుతో నెల్లూరు జిల్లాలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు. ప్రస్తుతం వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్నారు. పట్టభద్రుల ఎంఎల్‌సి టిడిపి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ గత ప్రభుత్వ హయాంలో కందుకూరు జడ్పిటిసి సభ్యుడిగా పనిచేశారు. జిల్లాల విభజన తర్వాత కందుకూరు నెల్లూరు జిల్లాలో విలీనమైనప్పటికీ స్థానిక టిడిపి నాయకులతో ఉన్న పరిచయాలతో పార్టీ విజయంపై దృష్టి సారించారు. అధికార పార్టీపై నిరుద్యోగుల్లో ఉన్న వ్యతిరేకత పట్టభద్రుల ఓట్ల రూపంలో తమకు అనుకూలించే అవకాశం ఉందని టిడిపి భావిస్తోంది. పిడిఎఫ్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి కనిగిరి వాసి. ఆయన ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్‌లో పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. రెండేళ్ల క్రితం స్వచ్ఛంధంగా ఉద్యోగ విరమణ చేశారు. ప్రస్తుతం పట్టభద్రుల ఎంఎల్‌సి స్థానానికి పోటీ పడుతున్నారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థిగా ఎపిటిఎఫ్ తరపున నెల్లూరుకు చెందిన ఎల్‌సి రమణారెడ్డి బరిలో నిలిచారు. ఆయనకు టిడిపి మద్దతు ప్రకటించింది. వైసీపీ నుంచి నెల్లూరులోని కృష్ణచైతన్య విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.చంద్రశేఖర్‌రెడ్డి పోటీపడుతున్నారు. పిడిఎఫ్ అభ్యర్థిగా బాబురెడ్డి నిలిచారు. నెల్లూరుకు చెందిన ఈయన ఇటీవల ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేశారు. ప్రస్తుతం పట్టభద్రుల ఎంఎల్‌సి యండపల్లి శ్రీనివాసులురెడ్డి ఉపాధ్యాయ నియోజకవర్గ ఎంఎల్‌సి బాలసుబ్రహ్మణ్యంల పదవీకాలం మార్చి 29తో ముగియనుంది. దీంతో అధికార, ప్రతిపక్ష పార్టీల వారు ఓటర్లను కలుస్తూ ముందుకెళ్తున్నారు.

ప్రభుత్వం స్థలాలో అక్రమంగా ప్రవేశిస్తే చర్యలు తప్పవు

చిల్లకూరు ఫిబ్రవరి 24 ప్రభాతవార్త : ప్రభుత్వ స్థలాలలో అక్రమంగా ప్రవేశిస్తే కఠిన చర్యలు తప్పవని చిల్లకూరు తహసిల్దారు జి స్వర్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో సర్వేనెంబర్ 191/1 -192లో 2,3,4,195లో 2,12,13,14,15,16,17 నెంబర్లలతో తూర్పు కనుపూరు గ్రామానికి చెందిన వారు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని క్రయవిక్రయాలు చేస్తున్నారని ఆదే గ్రామానికి చెందిన ఒ వ్యక్తి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం జరిగింది. దీంతో చిల్లకూరు తహసిల్దారు జి.స్వర్ణ ఆధ్వర్యంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతు 1905 యాక్ట్‌ప్రకారం ప్రభుత్వ స్థలాలలో క్రయవిక్రయాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని సూచకబోర్డులు ఏర్పాటు చేశారు. ఈకార్ యక్రమంలో డిటి, ఆర్ఐ రమ్య, విఆర్ఒ రామచంద్రయ్య, విఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి, గాయాలు!

నాయుడుపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త : నాయుడుపేట పట్టణంలోని చంద్రబా

రాజకీయ పట్టు కోసం అత్తా కోడళ్ళ పరుగులు

-లోకేష్ పాదయాత్రతో దేశం వర్గాల్లో జోష్

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 24ప్రభాతవార్త :
శ్రీకాళహస్తి నియోజకవర్గంను దీర్ఘకాలం పరిపాలించిన బొజ్జల కుటుంబం 2019లో జరిగిన ఎన్నికల్లో అధికారం కోల్పోయారు. అయితే ఇక్కడ వైసిపి ఎంఎల్ఏగా గెలిచిన శాసనసభ్యుడు తన వర్గాన్ని ఏర్పాటు చేసుకుని తిరుగులేని శక్తిగా ఎదిగారు. అంతేకాక ఇతరుల చేతికి పగ్గాలు ఇవ్వకుండా ప్రజలతో సరాసరి సంబంధాలను మెరుగుపరచుకున్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా నష్టమొచ్చినా 'నేనున్నానని' భరోసా కల్పిస్తూ తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. సుమారు 35 సంవత్సరాల పాటు పరిపాలించిన బొజ్జల కుటుంబానికి షాక్ ఇచ్చి గెలుపొందిన ఆయన నియోజకవర్గంలోనే ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉన్నారనే భరోసా కల్పించారు. తానొక్కడే కాకుండా తన తనయ, తనయుడు కూడా ప్రజలకు సేవలందించటానికే అంకితం చేసామని పలుమార్లు ప్రకటించారు. చక్కటి వాతావరణంలో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అయితే 2024లో జరిగే సాధారణ ఎన్నికల్లో మళ్ళీ 'శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తెలుగుదేశం' జెండాను ఎగురవేసి తమ కుటుంబంపై ప్రజల విశ్వాసం ఏమిటో నిరూపించుకొనుటకు బొజ్జల

కుటుంబం కృషి చేస్తుంది. వీరీ ప్రయత్నానికి ఇటీవల మూడు రోజుల పాటు శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పర్యటించిన జాతీయ తెలుగు దేశం పార్టీ కార్యదర్శి నారాలోకేష్‌బాబు పాదయాత్ర పార్టీ వర్గాల్లో జోష్ నింపింది.నిస్తేజమైన కార్యకర్తలు ద్వితీయ శ్రేణి నాయకుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని చెప్పవచ్చు. రాజకీయంగా రాణిస్తున్న బొజ్జల కుటుంబ సభ్యులు ఈ సారి సరికొత్త ప్రణాళికతో ముందడుగు వేస్తున్నారు.

అత్తా కోడళ్ళ పరుగులు:
2014 నుంచి గోపాలకృష్ణారెడ్డి ఆనారోగ్యంతో ఆయన తనయుడు బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆయన తల్లి బొజ్జల బృందమ్మలు రాజకీయ ప్రవేశం చేసారు. అయితే 2019లో వారు పరాజయం పొందిన తరువాత వారి కుటుంబంలో ఎన్నో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నాయి. దాంతో వారు రాజకీయానికి కొంత దూరమ య్యారు. మూడు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించిన లోకేష్ పాదయాత్రలో బొజ్జల కుటుంబం వ్యవహరించిన తీరు గమనించదగ్గది. నారాలోకేష్ రూట్ మ్యాప్‌ను ముందే ప్రకటించారు. అయితే అంతకు ముందే బొజ్జల బృందమ్మ, ఆమె కోడలు సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డిలు పైలట్స్‌లా పరుగులు తీసారు. ఏ గ్రామానికి ఆ గ్రామం వద్ద వారు మహిళలతో సమావేశాలు జరపటం గమనించదగ్గ విషయం. సుమారు పది సంవత్సరాల పాటు బొజ్జల బృందమ్మతో నియోజకవర్గంలోని మహిళలు మమేకమయ్యారు. అత్తాకోడళ్ళు గతంలో ఎన్నడూ లేని విధంగా లోకేష్ బహిరంగ సభల్లో కూడా పాల్గొనటం విశేషం. రాబోవు ఎన్నికల్లో తమ కుటుంబానికి మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు.నియోజకవర్గంలో మళ్ళీ తెలుగుదేశం జెండాను ఎగురవేయాలనే లక్ష్యంతో వారు పట్టుదలగా పరుగులు తీస్తున్నారు.

పద్మావతీ అమ్మవారికి ఘనంగా ఊంజల్‌సేవ

నారాయణవనం, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :



నారాయణవనంలోని కల్యాణవెంకటేశ్వరుని ఆలయం లో శుక్రవారం భక్తుల సందడి అధికమైంది. అంతకు ముందు అమ్మవారిని,స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి సుగంధద్రవ్యాలతో అభిషేకిం చారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారిని ఊరేగించారు. అనంతరం 5 గంటల నుంచి గంట పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని టెంకాయ హారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నెయ్యి దీపాలను వెలిగించారు. టిటిడి అధికారులు భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు.

తుడా విసికి వినతిపత్రం ఇచ్చిన కిరణ్‌కుమార్

తిరుపతి (క్రీడ), ఫిబ్రవరి 24 ప్రభతవార్త :

తుడా ఆఫీస్‌లో వైస్ చైర్మన్ హరికృష్ణని సాధారంగా కలిసి దుస్సాలువా కప్పి భగవద్గీతను జెన్ అకాడమి కార్యదర్శి చీనేపల్లి కిరణ్ కుమార్ బహుకరించారు. ఈ కార్యక్రమంలో తుడా ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివా సులు రెడ్డి, విశ్రాంత పిడి పెన్నా భాస్కర్ పాల్గొ న్నారు. అనంతరం తిరుపతిలో క్రీడల అభివృద్ధి కోసం తుడా ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమా లు చర్చించి, క్రీడల అభివృద్ధికి జెన్ అకాడమికి తుడా కొంత స్థలం కేటాయించాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. 18 సంవత్సరాలుగా వేల మందికి క్రీడల్లో ఉచిత శిక్షణ ఇచ్చిన ఇస్తున్న జెన్ అకాడమి కోసం తప్పకుండా పరిశీలించి స్థలం కేటాయిస్తామని హరికృష్ణ చెప్పడం ఆనందదాయకం అని కిరణ్ కుమార్ తెలిపారు.

ఆటో కార్మికులకు గేట్ వసూలు ఆపాలి : సిఐటియు

పుత్తూరు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :
మునిసిపాలిటీ పరిధిలో ఆటో కార్మికుల నుంచి గేట్ వసూలు చేయడం అన్యాయమని సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్ ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిన నేపథ్యంలో ఆటో కార్మికుల బతుకులు అంతంత మాత్రంగా వున్నాయని ఈ పరిస్థితుల్లో కార్మికుల నుంచి గేట్ వసూలు చేయడం సరికాదని శుక్రవారం మునిసిపల్ కమిషనర్ కె.ఎల్.ఎన్.రెడ్డికి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలకు గేట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తిరుపతి, కాళహస్తిలో ఆటోల నుంచి గేట్ వసూలు చేయడం లేదని తెలిపారు. పుత్తూరు, నగరి మునిసిపాలిటీల్లో వసూలు చేస్తున్నారని దీనిపై రెండేళ్లుగా వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదని తెలిపారు. ఈ ఏడాది నుంచైనా గేట్ వసూలు నిలపాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. వినతపత్రం ఇచ్చిన వారిలో ఆటో యూనియన్ నాయకులు ఎ.విజయ్, యాసిన్ బాషా, గోవిందస్వామి, సుబ్రమణ్యం తదితరులున్నారు.

వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య రాకూడదు : ఎంపీడీవో

కేవీబీ పురం, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:
వేసవి దృష్ట్యా ఎక్కడా తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడకుండా తగు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో తెలిపారు. మండల కేంద్రమైన కేవీబీ పురం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మునిలక్ష్మి నందకుమార్ అధ్యక్షతన ఎంపీడీవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ఎక్కడా కాని తాగునీటికి ఇబ్బందులు పడకూడదని ప్రజలకుఎక్కడా కూడా మోటార్లు మరమ్మతులు ఉంటే తగు చర్యలు తీసుకుని తాగునీటి సౌకర్యం కల్పించేందుకు తగు చర్యలు చేపట్టాలని తెలిపారు. విద్యుత్ సరఫరాకు ఆటంకం కాకుండా రైతులకు ఇళ్ళకు ఎలాంటి ఇబ్బందులు విద్యుత్ సరఫరాను మెరుగుపరచుకుని వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీడీవో ట్రాన్స్‌కో అధికారులను కోరారు. మండల కేంద్రమైన ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టలులో తిరిగి ప్రారంభించాలని స్థానిక ఎమ్మెల్యే స్థానిక మండల స్థాయి నాయకులకు కూడా జిల్లా కలెక్టర్ ద్వారా సాంఘిక సంక్షేమ శాఖ, రాష్ట్ర స్థాయి అధికారులకు తెలిపారు. ఎంపీడీవో రామచంద్రయ్య తప్పకుండా ఎస్సీ హాస్టల్‌ను ప్రారంభించే విధంగా సీఎంకి తెలుపుతామని హామీ ఇచ్చారు. సమావేశంలో మండల నాయకులు, కార్యకర్తలు, తదితర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టైలర్స్ అసోసియేషన్‌చే చైర్మెన్‌కు సత్కారం

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :

శ్రీకాళహస్తి టైలర్స్ అసోసియేషన్ చే శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరా లయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులును ఘనంగా సత్కరిం చారు. శ్రీకాళ హస్తీ శ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను సమర్థవంతంగా, క్రమశిక్షణతో నిర్వహిస్తూ మంచి పేరు సంపా దించు కుంటున్న శ్రీనివాసులు టైలర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కావటం ఎన్నో సమస్యలను పరిష్కరించటం గమనించదగ్గ విషయమని దర్జీలు అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకు దుశ్శాలువతో సత్కరిస్తే ఈ నెల 28న జరిగే టైలర్స్ డే కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని కోరారు. టైలర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా టైలర్స్ కాలనీని రక్షించటంలో శ్రీనివాసులు చొరవను ప్రశంసించారు.ఈకార్యక్రమాల్లో గౌరవ సలహాదారు చాంద్‌బాషా, శ్రీనివాసులు, అధ్యక్షుడు సుబ్రమణ్యం, ఉపాధ్యక్షుడు ఆశోక్, సభ్యులు రాజా కృష్ణ జాఫురుల్లా, సుధా, బత్తెయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రియాశీల సభ్యత్వంపై జనసేన నాయకులు పర్యటన

తొట్టంబేడు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :

క్రియాశీల సభ్యత్వ నమదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని గాంధీవీధిలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుత కోట ఇంటింటికి పర్యటించారు. ఇందులో భాగంగా క్రియాశీల సభ్యత్వం నమోదు కార్యక్రమం గురించి వివరించారు. అలానే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. ముఖ్యంగా ఈప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉందని కాలువలు శుభ్రం చేయకపోవడంతో వర్షాకాలంలో డ్రైనేజీ మురుగునీరంతా రోడ్లపైన, ఇంటిముందు నిలబడిపోవడంతోఇబ్బందులు ఎదుర్కొంటున్నామని జనసేన నాయకుల దృష్టికి తెచ్చారు. అతేకాకుండా వీధిలైట్లు సరిగా పనిచేయడం లేదని నిత్యావసర సరుకుల ధరలు పెరగడం వల్ల సామాన్యులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఈసమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దండిరాఘవయ్య, నాయకురాలు పుష్ప, జనసైనికులు భాను, పెంచలయ్య, గుర్రప్ప, శ్రీనివాసులు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు సిఐ ఓబులేష్ పటిష్ట చర్యలు

చంద్రగిరి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:

రోడ్డు ప్రమాదాల నివారణకు సిఐ ఓబులేష్ పటిష్ట చర్యలు చేపట్టారు. పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారి పనపాకం వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండటంతో పలువురు అకాల మృత్యువుకు బలయ్యారు. దీంతో చలించిన సిఐ గురువారం ఈ ప్రాంతంలో ఎంవిఐ శ్రీనివాసులు, ఎన్‌హెచ్ 5 మేనేజర్ కృష్ణారెడ్డితో కలసి ఆయన సునిశిత పరిశీలన గావించి రేడియం స్టిక్కర్లను అతికించిన డ్రమ్‌లను రోడ్డుపై ఏర్పాటు చేశారు. ప్రమాదాల నివారణకు వాహనచోదకులు ఆగిచూసి వెళ్ళే విధంగా అప్రమత్తం చేస్తూ డ్రమ్‌లను రోడ్డుపై ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుండి తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే ప్రయాణికులు (వాహన చోదకులు) ఈ మార్గంపై సరైన అవగాహన లేకపోవడంతో ప్రమాదాలకు గురై అశువులుబాస్తున్నారని ఆవేదన చెందారు. జాతీయ రహదారి విస్తరణ పనులు కొంత మిగిలిపోయిన నేపథ్యంలో వాహన చోదకులు వేగాన్ని నియంత్రణలో పెట్టుకోవాలన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనాలు నడిపే వారు కనీస జాగ్రత్తలు పాటించాల న్నారు. ముందు వెళ్ళే వాహనాలను అధిగమించడం, నిద్రలేమి, మద్యం సేవించి వాహనం నడపడం, హైవే పట్ల అవగాహన లేకపోవడం వంటి చర్యలు ప్రమాదాలకు కారణం కాగలవన్నారు. ప్రమాదాల నివారణకు ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు ఎప్పకప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

వెలంపాడులో ఉచిత వైద్యశిబిరం

శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :
శ్రీకాళహస్తి మండలం వెల్లంపాడు గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరాన్ని హెల్పేజ్ ఇండియా, సుధసోమాని సంయుక్తంగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసాంఈ వైద్యశిబిరంలో 40 సంవత్సరాలు పైబడిన మధ్య వయస్కులకు వృద్ధులకు దంత స్క్రీన్ పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్యపరీక్షలు జరిపారు. అవసరమైన వారికి మందులు పంపిణి చేసారు. కొంత మందికి కొత్త దంతాలను ఇవ్వటానికి నిర్ణయించినట్లు నిర్వాహకులు వివరించారు. ఈ వైద్యశిబిరానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి విశేష సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈ కార్యక్రమాల్లో 28 మంది వైద్యపరీక్షలు జరిపించుకుని చికిత్స పొందినట్లు వివరించారు.ఈ కార్యక్రమాల్లో కళాధర్, సుధాసోమాని, సిరామిక్స్ అధికారి లోకేష్‌నాయుడు,వైద్యబృందం అజయ్ కుమార్, గౌస్,అహమ్మద్,అజయ్‌కుమార్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు. శనివారం రక్త దాన శిబిరాన్ని నిర్వహించనున్నారు..

వైభవంగా ముక్కోటి మహాశివరాత్రి ఉత్సవాలు

చంద్రగిరి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:
పార్వతీ పరమేశ్వరుల ప్రియ పుత్రుడు శ్రీవినాయక స్వామి వారు మూషిక వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. తొండవాడ స్వర్ణముఖీ నదీతీరాన వెలసియున్న శ్రీ అగస్త్యేశ్వరస్వామి వారి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించారు. ఇందులో భాగంగా శుక్రవారం ఆలయ అర్చకులు ఉదయం 6 గంటలకు స్వామి అమ్మ వార్లకు అభిషేకం నిర్వహించారు. ఉదయం 7 గంటలకు స్వామి వారికి శాకాంబరి అలంకరణ గావించారు. 8 గంటలకు శ్రీ వినాయక స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. 9 గంటలకు శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి అభిషేకం జరిపించారు. జై భోలో గణేష్ మహరాజ్ కీ అంటూ భక్తుల భజనల నడుమ స్వామి వారు ఆలయ మాడవీధులలో విహరించారు.

దళితుల శ్మశాన వాటికకు దారి కల్పించకపోవడం భాధాకరం

-అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుణ్యమూర్తి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:

నెన్నూరు హరిజనవాడ శ్మశాన వాటికకు ఎన్నో సంవత్సరాలుగా దారి కల్పించకపోవడం బాధాకరమని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతమాకుల పుణ్యమూర్తి అన్నారు. శుక్రవారం నెన్నూరు హరిజనవాడలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు మౌళిక వతులలో భాగంగా శ్మశాన వాటికకు దారి, గ్రామంలో రోడ్లు, మంచినీరు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై వుందన్నారు. చంద్రగిరి మండలం, మామండూరులో, నెన్నూరులో దారి సమస్యలు తలెత్తాయనీ, ఇందుకు అధికారులు పరిష్కారమార్గం చూపకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం నామమాత్రంగా జీఓలు, సర్క్యులర్లు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నట్లు దుయ్యబట్టారు. ఎంఎల్ఏ ప్రత్యేక చొరవ తీసుకుని దళితుల శ్మశాన వాటిక దారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో దళిత సంఘాలతో కలసి పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

తిరుపతిలో ఈనెల 27,28న పారిశ్రామిక ఎగ్జిబిషన్

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:
తిరుపతిలో ఈనెల 27,28 తేదీలలో వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, పారిశ్రామిక ఎగ్జిబిషన్ రామె గెస్ట్ లైన్ డెస్ హోటల్‌లో నిర్వహిస్తున్నట్లు భారత ప్రభుత్వ ఎం.ఎస్.ఎం.ఇ. మంత్రిత్వశాఖ, విశాఖపట్నం సహాయ సంచాలకులు జి.వి.ఆర్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన యువత, ఔత్సాహికులు పాల్గొనాలని సూచించారు. ఈ ఎగ్జిబిషన్‌లో వివిధ సూక్ష్మ, చిన్న, మధ్య, పెద్ద పరిశ్రమల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచడం, బయ్యర్ అండ్ సెల్లర్స్ మీట్, ముఖాముఖి కార్యక్రమాలకు ఒక వేదికగా ఉంటాయని తెలిపారు.

ఆర్టీసీలోని 88 షాపులకు దరఖాస్తుల ఆహ్వానం -డిపిటిఓ చెంగల్‌రెడ్డి

తిరుపతి ప్రెస్‌క్లబ్,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:
జిల్లాలోని ఆర్టీసీ డిపోలలో ఖాళీగా ఉన్న 88 దుకాణాలను అద్దె ప్రాతిపదికన నిర్వహించుకోవడానికి నిర్వాహకుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపిఎస్‌ఆర్టీసీ తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి(డిపిటిఓ) తిమ్మాడి చెంగల్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.టెండర్‌కు సంబంధించిన దరఖాస్తులు ఆయా డిపో మేనేజర్ కార్యాలయాలలో ఉదయం 10-30 నుండి సాయంత్రం 5 గంటల వరకు లభిస్తాయన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 10వ తేదీ మద్యాహ్నం 2 గంటల లోపు జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలోని టెండర్ బాక్స్‌లో పూర్తి చేసిన దరఖాస్తులను వేయాలన్నారు.మద్యాహ్నం 3 గంటలకు టెండరుదారుల సమక్షంలో టెండర్లను తెరుస్తామని డిపిటిఓ చెంగల్‌రెడ్డి వివరించారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

సత్యవేడు, ఫిబ్రవరి24,ప్రభాతవార్త:

సత్యవేడు మేజర్ పంచాయితీలోని గాంధీ కూడలి వద్ద శుక్రవారం ఎస్ఐ పురుషోత్తంరెడ్డి తమ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. వాహన ధ్రువపత్రాలను పరిశీలించి ,సక్రమంగా లేని వాహనాలను అపరాధ రుసుములు విధించారు. ఈసంధర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన దారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. పోలీసువారి సూచనలు పాటిస్తూ వ్యక్తిగత భద్రత ప్రమాణాలను జాగ్రత్తగా అనుసరించాలని కోరారు. రోడ్డుభద్రతా నియమాలకు వ్యతిరేఖంగా నడుచుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గరుడవాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన వెంకటేశ్వరస్వామి

శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :
తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధ ఆలయంగా మండ లంలోని తొండమనాడు లో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆల యంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కళ్యాణోత్సవం అనంతరం రాత్రి స్వామివారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి ఆలయంలో విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించి స్నపన తిరుమంజనం సేవను నిర్వహించడంతో పాటు సాయంత్రం స్వామిఅమ్మవార్లకు ఊంజలోసేవను నిర్వహించారు. రాత్రి పురవీధుల్లో వెంకటేశ్వరస్వామి శ్రీదేవి భూదేవిల ఉత్సవ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి గరుడవాహనంపై ఆశీనుల్ని చేసి హారతులిచ్చిన తర్వాత భక్తులకు దర్శనమిచ్చారు. వాహనసేవను తిలకించేందుకు అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా పలువురు స్వామిఅమ్మవార్లకు హరతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమాల్లో డిప్యుటీ ఈవో దేవేంద్రబాబు, ఎఇఒ పార్థసారధి, జూనియర్ అసిస్టెంట్ రవిల పర్యవేక్షణ కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఉత్సవంలో ఎలాంటి అవాంఛనీయం సంఘటనలు జరగకుండా రూరల్ సిఐ అజయ్‌కుమార్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది బందోబస్తును పర్యవేక్షించారు

తిరుపతి డివిజన్

డిగ్రీ కళాశాలలో నక్షత్రవనం ప్రారంభించిన ప్రిన్సిపాల్

నగరి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:

భారత జీవన విధానం ప్రకృతితో ముడిపడి ఉందని ప్రజల దైనందని జీవితాన్ని పర్యావరణాన్ని అనుకూల ఆధారాలతో, అలవాట్లతో ముడిపడి ఉండేటట్లు చేశారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.వేణుగోపాల్ తెలియజేశారు. శుక్రవారం కళాశాలలో నక్షత్ర వనం కార్యక్రమం ప్రారంభిస్తూ ఆరోగ్యం-పర్యావరణం విడదీయలేనివని దీనిని దృష్టిలో ఉంచుకుని ఔషధ మొక్కలను కళాశాలలో నాటడం, సంరక్షించడం గొప్ప విషయమని ఆయన పేర్కొన్నారు. 27 నక్షత్రాలకు సంబంధించిన 27 మొక్కలను అధ్యాపకులు, విద్యార్థులు వారి వారి నక్షత్రాలకు అనుగుణంగా నాటారు. వృక్షశాస్త్ర విభాగ అధిపది డా. ఇందిరాప్రియదర్శిని మాట్లాడుతూ జ్యోతిష్య శాస్త్రంలో 28 నక్షత్రాలకు ప్రత్యేక దేవతలు, అధి దేవతలు ఉన్నట్లుగా వాటికి సంబంధించిన చెట్లు కూడా ఉన్నాయని, వీటిని పెంచడం వలన మానసిక ప్రశాంతత, ఆరోగ్యం, ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచుకోవడమేగాక పర్యావరణానికి కూడా ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, డా. అరుణకుమారి, భాస్కర్‌రాజు, చిన్న పాపమ్మ, షర్మిల, పంకజ, సుహాసిని, సరిత, శివలక్ష్మి, మునికుమారి, నరసయ్య, మీనాక్షి, విద్యార్థులు పాల్గొన్నారు.

టిటిడి ఆధ్వర్యంలో శరభయ్య యాదవ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

-అఖిల భారత యాదవ మహాసభ డిమాండ్

తిరుపతి ప్రెస్‌క్లబ్,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:

తిరుమలలో మొట్టమొదటి శ్రీవారి దర్శనం చేసుకున్న సన్నిధి గొల్ల అయిన శరభయ్య యాదవ్ విగ్రహాన్ని టిటిడి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని అఖిల భారత యాదవ మహాసభ జాతీయ కౌన్సిల్ సభ్యుడు వై.షణ్ముగం యాదవ్ డిమాండ్ చేశారు.శుక్రవారం స్థానిక అలిపిరి పాదాల మండపం వద్ద స్థానిక హక్కుల పోరాట సమితి మరియు టిటిడి ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తిరుపతి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే తిరుపతి ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతి ఏడాది టిటిడి ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ప్రజలందరి సహకారంతో తిరుపతి ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించిన నిర్వాహకులకు ఆయన అభినందనలు తెలియచేశారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా దిండుకుర్తి

తిరుపతి ప్రెస్‌క్లబ్,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:

తిరుపతి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా మరోమారు దిండుకుర్తి నరసింహులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.గత పాలకమండలి 2023 జనవరితో పదవీకాలం పూర్తయ్యింది. అనంతరం నూతన పాలకమండలిని ఎన్నుకుని శుక్రవారం స్థానిక కొత్తవీధిలోని శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అసోసియేట్ కార్యదర్శి మువ్వల నరసింహులు ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఏపి ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు బలస వేణుగోపాల్,శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయ పాలకమండలి వర్కింగ్ ప్రెసిడెంట్ పామిడి సత్యనారాయణ,కొండూరి మహేష్,కామిశెట్టి శ్రీధర్,హేమచంద్రకుమార్, శిరీష, మంజు నాథ్,కార్యవర్గ సభ్యులు మరియు పెద్ద ఎత్తున అన్ని ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

పది విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

-డాలర్స్ గ్రూప్ ఆఫ్ చైర్మన్ డా॥సి.దివాకర్‌రెడ్డి

తిరుపతి ప్రెస్‌క్లబ్,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:

పదవ తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులందరూ 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని డాలర్స్ గ్రూప్ ఆఫ్ చైర్మన్ డా॥సి.దివాకర్‌రెడ్డి ఆకాంక్షించారు. డా॥ దివాకర్‌రెడ్డి కుమార్తె గేహిని జన్మదినం సందర్భంగా శుక్రవారం ఆయన స్వగృహం నందు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ప్యాడ్లు,నోట్ బుక్స్,పెన్ను,పెన్సిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు

ఆర్డీవో నూతన భవనానికి స్థల పరిశీలన చేస్తున్నాం

తొట్టంబేడు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పట్టణంలో ప్రస్తుతం ఉన్న ఆర్డీవో కార్యాలయం శాశ్వత భవనానికి స్థల పరిశీలన చేస్తున్నామని ఆర్డీవో కెఎస్.రామారావు తెలిపారు. శుక్రవారం తొట్టంబేడు కార్యాలయానికి ఆయన విచ్చేసి పలురికార్డులు, అధికారులు పనితీరును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఇంటి నిర్మాణాలను వేగవంతం చేస్తున్నామని మార్చిలోసామూహిక గృహప్రవేశాలకు సిద్ధం చేస్తున్నామన్నారు. ఇప్పటకే అందరు అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశామనిఇంటి నిర్మాణాలు వేగవంతం చేశామన్నారు. తొట్టంబేడు తహశీల్దార్‌కార్యాలయానికినిధులుమంజూరయ్యాయన్నారు. ఇక కార్యాలయంలోఎవరెవరుసిబ్బందిఏఏపనులుచేస్తున్నారో తెలుసుకు న్నారు.

డిడిలు కట్టని వారికి నోటీసులు ఇవ్వండి : ఆర్డీవో

ప్రజలకు ప్రభుత్వం చౌకదుకాణదారుల ద్వారా అందించే బియ్యం, కందిపప్పు, చక్కెరలు సక్రమంగా అందిస్తున్నారా? లేదా? అని ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సుజాతమ్మను ప్రశ్నించగా కందిపప్పుకు

ఎవ్వరు డిడిలు చెల్లించడం లేదని చెప్పడంతో డీలర్లకు అందరికీ నోటీసులు జారీచేయమని ఆర్డీవో ఆదేశించారు. మార్కెట్‌లో రూ.130లు ఉన్న కందిపప్పు ధర చౌకదుకాణాల ద్వారా రూ.68లు అందిస్తున్నామని ఇది నిరుపేదలకు ఎంతో వరమన్నారు. అయితే డీలర్లు డిడిలు కట్టకపోవడం శోచనీయం అన్నారు. మొత్తం ఎన్ని చౌకదుకాణాలు ఉన్నాయి, ఎంతమంది డీలర్లు ఉన్నారో తెలుసుకున్నారు. కేవలం బియ్యం మాత్రమే ఇస్తే సరిపోదని కందిపప్పు, చక్కెరలు కూడా అందించాలని కోరారు. ఒకే దేశం, ఒకే రేషన్‌కార్డు వచ్చిన తర్వాత ఎవరు ఎక్కడైనా రేషన్ తీసుకోవచ్చని అయితే దీనిపై సంబందిత డీలర్లుతోసమావేశం ఏర్పాటుచేసి చర్చిస్తామన్నారు.

రికార్డుల గదిని పరిశీలించిన ఆర్డీవో..

పురాతన కాలం నాటి రికార్డులు భద్రపరచిన రికార్డుల గదిని ఆర్డీవో రామారావు పరిశీలించారు. ఇక్కడ ఉన్న డికెటి భూములు రిజిస్టర్లు, అడంగళ్ళు, వన్‌బి రిజిస్టర్లు, జనన, మరణాల రికార్డులను పరిశీలించారు. అయితే వర్షాకాలంలోగది ఉరుస్తుండడం గుర్తించిన ఆయన త్వరలోనేకొత్త భవనం వస్తుందని ఆశించారు. ఉన్న రికార్డులను భద్రంగా ఉంచాలన్నారు. తహశీల్దార్ సుధీర్‌రెడ్డి వచ్చిన తర్వాత తొట్టంబేడు మండలం గాడిలోపడిందని ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. అన్నదాతలు, ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించాలన్నారు. తొట్టంబేడు తహశీల్దార్ ప్రాంగణంలో అన్నిశాఖలు ఒకేచోట ఉండడం తో ఆర్డీవో కార్యాలయాన్ని కూడా ఇక్కడే ఏర్పాటు చేసేందుకు పరిశీలిస్తున్నట్లు తెలిపారు.సీనియర్ అసిస్టెంట్ మురళీ, విఆర్‌ఏలు అంకయ్య, భవానీ, కంప్యూటర్ ఆపరేటర్ సురేష్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

టివి 66 పూర్వవిద్యార్థుల ఆత్మీయసమ్మేళనం

తిరుపతి,ఫిబ్రవరి 24ప్రభాతవార్త: తిరుపతి పశువైద్యకళాశాల టివి 66బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంతో అందరూ ఒక్కచోట చేరారు. శుక్రవారం కళాశాల ప్రాంగణంలో పాతవి ద్యార్థులు కలవడంతో సందడినెలకొంది. పశువైద్యకళాశాలలో చదివిన రోజులను, తమ గురువులతో కలసి పంచుకున్న పలు అభిప్రాయాలను గుర్తుచేసుకున్నారు. పరస్పరం అభినందనలు తెలియజేసుకున్నారు. కళాశాలకు తమవంతుగా సేవలందించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా తమకు విద్యనేర్పిన గురువులు ఆరుగురిని ఆత్మీయంగా సన్మానించి, ఆశీర్వాదం అందుకున్నారు.

కన్నుల పండువగా ప్రసన్న వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం

శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం కన్నుల పండువగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్సవం సందర్భంగా ఆలయ ఆవరణలోనే కాకుండా చుట్టుపక్కల చక్కగా విద్యుత్ దీపాలతో అలంకరించారు.అలాగే ఆలయ ఆవరణలో కళ్యాణానికి సంబందించి వేలాది మంది కూర్చొటానికి వీలుగా షామియానాలను ఏర్పాటు చేసారు. చుట్టుపక్కల సుమారు 20 గ్రామాల నుంచే కాకుండా శ్రీకాళహస్తి పట్టణం నుంచి కూడా భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు.శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవాన్ని సంప్రదాయం బద్దంగా స్వామి అమ్మవార్ల కళ్యాణం భావి తరాలకు మన వివాహవ్యవస్థకు సంబంధించి అవగాహన కల్పించే విధంగా టిటిడి అధికారులు ఏర్పాట్లు చేసారు. కళ్యాణ మండపం ను ఏర్పాటు చేసారు. హోమం ఏర్పాటు చేసారు.వాహనాల మండపంలో ఉత్సవర్లను వధువు వరుడుగా అలంకరించారు. చక్కగా ముస్తాబు చేసి ఊరేగింపుగా కళ్యాణ మండపానికి చేర్చారు.అక్కడ ఆగమ శాస్త్రం ప్రకారం వివాహమహోత్సవం కార్యక్రమాలను నిర్వహించారు. వేద పండితులు వేద మంత్రాలను చదువుతుండగా కళ్యాణోత్సవం కమనియం అన్నట్లు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆనంద్‌స్వామి సదాశివయ్యలు కళ్యాణోత్సవాన్ని నిర్వహించి మంగళధారణ గావించారు. ఈ కార్యక్రమాలకు డెప్యూటీ ఇఒ దేవేంద్రబాబు, ఆలయ ఎఇఒ పార్థసారధి, సూపరింటెండెంట్ శ్రీనివాసులు,టెంపుల్ ఇన్స్పెక్టర్ రవికుమార్ సారధ్యంలో ఉత్సవాలు సందర్భంగా ఆలయాన్ని చక్కగా ముస్తాబు చేసారు. వచ్చిన భక్తులు వేలాది మంది కూర్చొటానికి ఏర్పాట్లు చేసారు.రాత్రి కన్నుల పండువగా స్వామి వారి కళ్యాణాన్ని నిర్వహించారు.

26న తిరుపతిలో ఎపిటిఎఫ్ మాసపత్రిక సభ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త : ఎపిటిఎఫ్(ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్) మాసపత్రిక 'ఉపాధ్యాయ' 75వసంతాలు పూర్తయిన సందర్భంగా ఈనెల 26న తిరుపతిలోని గంధమనేని శివయ్య భవన్‌లో నిర్వహించే సభను విజయవంతం చేయాలని తిరుపతి జిల్లా ఎపిటిఎఫ్ అధ్యక్షులు బి.మురళీకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు హజరై విజయవంతం చేయాలని కోరారు. వీరికి బసవసతిని తిరుపతిలోని ఎంజిఎం ఉన్నత పాఠశాల మరియు టిపిపిఎం ఉన్నత పాఠశాలల్లో గదులు కేటాయించామని దీన్ని ఉపాధ్యాయులు గమనించాలని కోరారు.

తెదేపా నాయకులు ఎస్‌పికి వినతిపత్రం

ర్త : శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలం మర్రిమంద వద్ద కర్రలు, రాళ్ళతోదాడికి ప్రయత్నించడంతో టిడిపి నాయకులు పోలీసులు తిరిగి టిడిపి నాయకులపై తప్పుడు కేసులు పెట్టడంపై రెడ్డిని మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి,నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, తిరుపతి పార్లమెంటు తెదేపా అధ్యక్షుడు నరసింహాయాదవ్, చిత్తూరు పార్లమెంటు టిడిపి అధ్యక్షుడు పులివర్తినాని,తెలుగుయువత అధ్యక్షుడు శ్రీధర్‌వర్మలుకలసివినతిపత్రాన్ని అందించా రు.

తిరుపతి ఆవిర్భావ దినోత్సవంలో...గంగమ్మ పసుపుకుంకుమ

తిరుపతి,ఫిబ్రవరి 24ప్రభాతవార్త: తిరుపతి ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం నగరంలో జరిగింది. ఈ కార్యక్రమంలో తాతయ్యగుంట గంగమ్మ నుంచి ఆలయ అర్చకులు, ఛైర్మన్ గోపీయాదవ్ , ఆలయ ఇఒ ఎం.మునికృష్ణ మంగళవాయి ద్యాలతో వెళ్ళి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డికి అందజేశారు.

యువనేతకు ఆర్‌సి వెంకన్న జ్ఞాపిక

తిరుపతి,ఫిబ్రవరి 24ప్రభాతవార్త:

యువగళం పాదయాత్రలో తిరుపతికి విచ్చేసి విడిది చేసిన యువనేత నారాలోకేష్‌కు టిడిపి కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ వెంకన్న ప్రతిమ జ్ఞాపికను బహుకరించారు.

తిరుపతి ఆవిర్భావ సభతో..అలిపిరిలో కొబ్బరికాయల మొక్కులు

తిరుపతి,ఫిబ్రవరి 24ప్రభాతవార్త:

శుక్రవారం తిరుపతిలో జరిగిన ఆవిర్భావ వేడుకల్లో భాగంగా అలిపిరి పాదాలమండపం వద్ద శ్రీవారి భక్తుడు నవీన్‌కుమార్‌రెడ్డి కొబ్బరికాయలు కొట్టి జయహో రామానుజాచార్య నినాదలు చేశారు.

వ్యవసాయంలో సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి

-భారత నూనె గింజల పరిశోధన సంస్థ డాక్టర్ మాథూర్

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:

నీటి వినియోగ సామర్థ్యం, పోషకాల వినియోగ సామర్థ్యం, కూలీల లభ్యత కొరవడుతున్న నేపథ్యంలో అవకాశాలను, సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని భారత నూనె గింజల పరిశోధన సంస్థ సంచాలకలు డాక్టర్ మాథూర్ తెలిపారు. సమగ్ర వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలతో రైతు ఆర్థికంగా బలపడతారని అభిప్రాయపడ్డారు. డ్రోన్ సాగునీటి ద్వారా పంటలకు ఎరువులు సరఫరా చేయుట, రైతులకు మార్కెట్ వ్యవస్తను ఏర్పాటు చేసి అధికా లాభాలను పొందే విధంగా కృషి చేయాలన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో భారత తీరప్రాంత వ్యవసాయ పరిశోధనా సంఘం నిర్వహించిన 13వ వార్షిక జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. కోస్తా తీరప్రాంతంలో వ్యవసాయ పర్యావరణ స్థితిస్థాపకత పెంపు అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. కోస్తా ప్రాంతాలు, ముంపుకు గురయ్యే ప్రాంతాలలో సమగ్ర నీటి యాజమాన్యం, పంటల సరళి, ఉద్యాన పంటలలో సమగ్ర సస్యరక్షణ, పంటల అభివృద్దిలో జన్యు విధానాలు, పంటలు ఉత్పాదకతపై జీవేతర పరిస్థితుల ప్రభావం, సహజ వనరుల యాజమాన్యం, కోస్తా సముద్రతీర ప్రాంతాలలో జీవ వైవిధ్యం, సాంఘిక, ఆర్థిక బాధ్యతలపై సాంకేతిక ప్రభావం అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎన్జీరంగా వర్శిటీ సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎల్.ప్రశాంతి, విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ కెవిజికె.రావు, డాక్టర్ మండల్, డాక్టర్ రమణ, డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో నేడు

25-2-2023 మోహరాత్రి-ఏకాంతసేవ

ఫాల్గుణ శుద్ధ షష్ఠి శనివారం రాత్రి 9గం.లకు దేవాలయం లోపల పల్లకీసేవ

ఉభయదాతలు : శ్రీయర్రా శ్రీరాములుశెట్టి గారు మరియు ఇతరులు

కుమ్మరిపేట గ్రామం, పొన్నేరి.

ధూర్జటి కళాప్రాంగణంలో నేడు:

వేదపండితుల సభ : సా.4గం.నుండి రా.7గం.ల వరకు

రా.7గం.నుండి :శ్రీ భవిరిరవి, మర్రిరమేష్, హైదరాబాదు వారిచే మహేంద్రజాలం

రా.10.గం.లకు : శ్రీమేధా నృత్యనికేతన్, పి.లక్ష్మి సరయు, కావలిబృందంచే నృత్యప్రదర్శన

రా.11గం.నుండి : డి.అమరావతి, గొట్టిపూడి వారిచే సత్యహరిశ్చంద్ర నాటకం

శ్రీచెంగాళమ్మ సన్నిధిలో ఉపముఖ్యమంత్రి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాత పరమేశ్వరిదేవిని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె.నారాయణస్వామి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, కార్యనిర్వహణ అధికారి ఆళ్ల శ్రీనివాసులురెడ్డి తదితరులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజల అనంతరం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెమ్మారెడ్డి త్రిలోక్‌చంద్రారెడ్డి, ట్రస్టుబోర్డు సభ్యులు, మాజీ ట్రస్టుబోర్డు సభ్యులు గోగుల తిరుపాల్ పాల్గొన్నారు.

శ్రీచెంగాళమ్మకు సారె సమర్పణ

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాత పరమేశ్వరి దేవికి మహా కుంభాభిషేక మహోత్సవంసందర్భంగాశ్రీకాళహస్తిదేవస్థానం నుంచి మర్యాదపూర్వకంగా శుక్రవారం సారెను సమర్పించారు. శ్రీకాళహస్తి దేవస్థానం ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అమ్మణ్ణికి సారె తీసుకొచ్చి సమర్పించారు. శ్రీకాళహస్తి దేవస్థానం ఛైర్మన్‌కు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సారె సమర్పణ అనంతరం ఘనంగా సన్మానించారు.

ఆటో కార్మికుడికి నారా లోకేష్ ఆటో వితరణ

పుత్తూరు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త : ఇటీవల మంత్రి రోజా ఇంటిపై దాడి కేసులో టిడిపికి చెందిన ఒక ఆటో కార్మికుడి ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. దీనినిపార్టీనగరినియోజకవర్గఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాశ్ యువగళం పాదయాత్రలో వున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఆటో కార్మికుడు హమీద్‌కు లోకేష్ కొత్త ఆటోను అందించారు. శుక్రవారం ఆటో కార్మికులను ఎక్కించుకుని పుత్తూరు పట్టణంలో కొంత దూరం భానుప్రకాశ్ ఆటో నడిపారు. నాయకులు,ఈ సంఘటన ఉత్సాహాన్ని నింపింది. తెలుగుదేశం పార్టీ ఆటో కార్మికులకు అండగా వుంటుందని ఈ సందర్భంగా భానుప్రకాశ్ స్పష్టం చేశారు.

తిరుపతిలో విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ గొప్ప ప్రారంభం

తిరుపతి నగరం, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త : దేశంలోనే పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న విజయ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను శుక్రవారం తిరుపతిలో ఆ సంస్థ ఛైర్మన్ డాక్టర్ సురేంద్రనాథరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మొత్తం 124 కేంద్రాలను ఇప్పటికే ఏర్పాటు చేయడం జరిగిందని, తిరుపతిలో 125వ సెంటర్‌ను ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ అత్యంత నాణ్యమైన డయాగ్నోస్టిక్ సేవలు అవసరం ఉన్నాయని, శర వేగంగా అభివృద్ధి చెందుతున్న తిరుపతి, చిత్తూరు ఉమ్మడి జిల్లాలతో పాటు రాయలసీమ ప్రాంతాల ప్రజలకు ఎంతో అనుకూల మైన తక్కువ ధరలకు షుగర్ పరీక్షల నుంచి విస్తృత బోర్ త్రిటీ ఎం.ఆర్.ఐ, డైమోన్షనల్ సిటీ, గామా కెమెరా, పూర్తి ఆటోమెటిక్ డిజిటల్ ల్యాబ్‌లతో అరుదైన క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సీఈవో సుప్రీతారెడ్డి మాట్లాడుతూ విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ నందు ఉన్నత ప్రమాణాలు, సంపూర్ణమైన సంరక్షణను అందించడంలో నిబద్ధత దిశలో ఓ ముందు అడుగు వేస్తున్నామన్నారు. ఆధునతిక సాంకేతిక అనుభవజ్ఞులైన నిపుణుల అసమానమైన నైపుణ్యం ద్వారా సకాలంలో విశ్వసనీయమైన రోగ నిర్ధారణకు హామీ ఇవ్వబడతాయని అన్నారు. కేంద్రాన్ని సందర్శించి రాయలసీమ ప్రజలు ఉచితంగా థైరాయిడ్, షుగర్ పరీక్షలను పరీక్షించుకోగలరని తెలియజేశారు. ఈ అవకాశాన్ని పూర్తి సౌకర్యాలతో కూడిన కేంద్రంలో ఒకే చోట ఉన్నతమైన డయాగ్నోస్టిక్ సేవలను పొందవచ్చునని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శివరాజ్ వినోద్ సర్వనన్, పీఆర్వో టీవీ రాఘవేంద్రన్, సీనియర్ బ్రాంచ్ మేనేజర్ జ్యోతిష్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యంకు ఘన సత్కారం

రేణిగుంట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:

చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల వైసీపీ ఎమ్మెల్సీగా ఏకగ్రీవమైన డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యంను రేణిగుంట మండల వైసీపీ నేతలు అభినందించి ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎవరు బరిలో లేకపోవడంతో డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎమ్మెల్సీ అయ్యారు. ఆయన ఏకగ్రీవం, వైసీపీ ఎమ్మెల్సీగా ఖరారు కావడం కోసం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అధిష్టానం వద్ద చాకచక్యంగా వ్యవహరించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే పోషించిన పాత్ర అమోఘం అని చెప్పవచ్చు. డాక్టర్‌సిపాయి సుబ్రహ్మణ్యం ఏకగ్రీవం కావడంతో రేణిగుంట ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, వైసీపీ సీనియర్ నేతలు జువ్వల దయాకర్‌రెడ్డి, యోగేశ్వర్‌రెడ్డి, సూరప్పకశం, ఎంపీటీసీ శశికిరణ్, గాజులమండ్యం సర్పంచ్ గంగారి రమేష్ తదితరులు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సమక్షంలో శ్రీలువులు కప్పి ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యేని అపర చాణిక్యుడిగా అభివర్ణిస్తూ పొగడతలతో ముంచెత్తారు. ఎమ్మెల్సీగా తనకు సీటు ఖరారు కావడం, ఏకగ్రీవం చేయడం కోసం కృషి చేసిన ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి, వైసీపీ పార్టీ ప్రముఖులకు సిపాయి ధన్యవాదాలు తెలిపారు.

మాటిచ్చి నెరవేర్చిన యువనేత లోకేష్

తిరుపతి,ఫిబ్రవరి 24ప్రభాతవార్త: యువగళం పాదయాత్రలో నగరి నియోజకవర్గంలో కొందరు తెలుగుమహిళలు చీర,గాజులు పండ్లు తీసుకుని మంత్రి ఆర్‌కె రోజాకు అందించడానికి ఆటోలో ఆమె ఇంటికెళ్ళారు. తెలుగుమహిళలు వెళ్ళిన సందర్భంలో హమీద్‌బాషా అనే ఆటోని పోలీసులు సీజ్ చేశారు. దీంతో జీవనోపాధి కోల్పో యానని లోకేష్ వద్ద ఆవేదన చెందాడు. ఆరోజు ఇచ్చిన మాటను శుక్రవారం ఉదయం తిరుపతిలో ఆటోడ్రైవర్ల ముఖాముఖిలో హమీద్‌బాషాకు కొత్త ఆటోను అందజేశాడు. కుటుంబసభ్యులతో కలసి ఆటోలో కూర్చుని లోకేష్ వారిని పలకరించడంతో ఆనందపరవశులయ్యారు.

బంగారు తిరుచ్చిపై పద్మావతి దేవి విహారం

తిరుచానూరు,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారు శుక్రవారం బంగారు తిరుచ్చిపై నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.ఇందేలో భాగంగా అమ్మవారిని వేకువజామున శుప్రభాతంతో మేల్కోలిపి నిత్య కైంకర్యాలు,అభిషేకం నిర్వహించారు.మద్యాహ్నం శ్రీకృష్ణస్వామి ముఖమండపంలో అమ్మవారి ఉత్సవమూర్తికి శాస్త్రోక్తంగా అభిషేకం చేశారు.సాయంత్రం అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఊంజల్‌సేవ నిర్వహించారు.అనంతరం వజ్ర వైఢూర్యాలు, పట్టు పీతాంబరాలతో అమ్మవారిని విశేషాలంకారణ చేసి బంగారు తిరుచ్చిపై అమ్మవారిని నాలుగు మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు.పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కర్పూర నీరాజనాలు సమర్పించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఒ లోకనాధం,సూపరింటెండెంట్లు మధు సూధన్, శేషగిరి,ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు,ఏవిఎస్ఒ శైలేంద్రబాబు,విఐ రామ్మోహన్,ఆలయ ఇన్స్ పెక్టర్లు ప్రసాద్, అశోక్,సుభాస్కర్‌నాయుడు,తదితరులు పాల్గొన్నారు.

కేంద్రప్రభుత్వ సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోండి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :

కేంద్రప్రభుత్వం కొయ్యబొమ్మల కళాకారులకు మరియు విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కమిషన్ డెవలప్‌మెంట్ కమిషన్ (హస్తకళలు) చేనేత జౌళిశాఖ కళాకారులకు అందిస్తున్న కార్యాక్రమాల గురించి చిత్తూరు హ్యాండీ క్రాఫ్ట్స్ ప్రొడ్యూసర్స్ ఎండి డాక్టర్ జి.దశరధాచారి వివరించారు. శనివారం స్థానిక ఎస్వీఏ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో సెమినార్‌ను ప్రిన్సిపల్ డాక్టర్ వై.నాగరాజునాయుడు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా విచ్చేసిన వారు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ గుమ్మిడిపూడి దశరధాచారి మాట్లాడుతూ కొయ్యబొమ్మల కళాకారులకు మరియు విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కమిషన్ ద్వారా ఖాదీ గ్రామీణ పరిశ్రమల నిరుద్యోగులకు పిఎంఇజిపి పథకం ద్వారా గ్రామీణ వాతావరణంలో నెలకొల్పే పరిశ్రమలకు 35శాతం సబ్సిడీతో కూడి రూ.50లక్షలు వరకు రుణ సౌకర్యాన్ని తయారీ పరిశ్రమలకు, సర్వీస్ పరిశ్రమలకు రూ.20లక్షలు వరకు రుణ సౌకర్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. పట్టణంలో నెలకొల్పేవారికి 25శాతం సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందన్నారు. అంతరించిపోతున్న హస్తకళలును అభివృద్ధి చేసి ముఖ్యంగా కళల యొక్క ప్రాధాన్యతను ఉన్నత పాఠశాలలో మరియు కళాశాల విద్యార్థులకు తెలియజేసేందుకు జరిగిందన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ వై.నాగరాజునాయుడు మాట్లాడుతూ చేతివృత్తుల హస్తకళలను కొయ్యబొమ్మల కళాకారులను ప్రోత్సహించాల్సిందిగా విద్యార్థులను, పట్టణ ప్రజలను కోరారు. ఎస్వీఏ కళాశాలకు కమ్యూనిటీ కళాశాల రావడానికి దశరధాచారి ఎంతో సహాయసహకారాలు అందించారన్నారు. విద్యార్థినులను ఇంటర్న్‌షిప్ చేయడానికి విద్యార్థులు సుధీర్ఘ దూరం వెళ్ళి కోర్సులు నేర్చుకోవడానికి కష్టపడుతున్న తరుణంలో తన ఇన్సిట్యూట్ ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇప్పించి వారికి సర్టిఫికెట్లు ప్రధానం చేసినటువంటి దశరధాచారి సర్వీస్ ఎంతో అమూల్యం కొనియాడారు. కార్యక్రమంలో సుమారు 30మంది కొయ్యబొమ్మల కళాకారులు పాల్గొని వారికి ఉన్న కళానైపుణ్యాన్ని ప్రదర్శించడంతో వారిని అభినందించారు.ముఖ్యఅతిథులుగా వైస్ ప్రిన్సిప్ మురళీ, సత్యనారాయణరెడ్డి, ఓపి.ప్ర సాద్, యం.తులసి, ఆర్.చంద్రమౌళి, జె.గిరీష్ కుమార్, యం.జయచంద్రబాబు, బి.నాగశేషాద్రి, పి.నవీ న్, సునీత,యన్.లక్ష్మిమోహన్,సునేష్‌బాబులుపాల్గొన్నారు.మరోరెండురోజులుపాటుప్రదర్శన ఉంటుందన్నారు.

శ్రీవారి పాదాల చెంత తిరుపతి 893వ జన్మదిన వేడుకలు

తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :

తిరుపతి శ్రీ వారి పాదాల చెంత తిరుపతి 893వ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ వారి పూజా కైంకార్యాలను నిర్ధేశించిన జగద్గురు శ్రీ రామానుజాచార్యులే స్వయంగా శంకుస్థాపన చేసిన ఒక నాటి బ్రాహ్మణ అగ్రహారమైన నేటి తిరుపతి.. పరపతి మరింత ఎత్తుకు పెరిగేలా ఎమ్మెల్యే, టిటిడి పాలక మండలి ప్రత్యేక ఆహ్వానితులు భూమన కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ పండగ కొనసాగింది. తిరుపతి ఆవిర్భావ రోజు సందర్భంగా తొలుత శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో భూమన కరుణాకర రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పట్టు వస్త్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చి శ్రీ గోవిందరాజు స్వామి వారికి సమర్పించారు. శ్రీ గోవిందరాజస్వామి ఆలయం వద్ద అర్చకులు, జియ్యర్ స్వాముల ఆశీస్సులు తీసుకుని శోభయాత్రను భూమన ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, భజన మండళ్ళ కళా ప్రదర్శనల నడుమ ఆధ్యాత్మిక యాత్ర శోభాయమానంగా మారింది. టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన చెక్క భజనలు, కోలాటాలు, కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. స్వామి వారి భక్తులు పౌరాణిక వేషధారణలో పాల్గొని తమ భక్తి ప్రపత్తులు ప్రదర్శించారు. కనుల పండగలా కొనసాగిన భక్తి యాత్ర ఆద్యంతరం.. గోవింద నామస్మరణలతో తిరుపతి పులకించిపోయింది. గుమ్మడి కాయలతో దిష్టి తీస్తూ, కర్పూర హారతులు పడుతూ తమ భక్తిని చాటుకున్నారు. జగద్గురు శ్రీ రామానుజాచార్యుల చిత్రపటాలను ప్రదర్శిస్తూ తిరుపతి ప్రజలు సమతా స్ఫూర్తి ప్రచారకర్తలై ముందుకు సాగారు. పుణ్యక్షేత్ర జన్మదిన వేడుకలు ఏటా కొనసాగాలని జీయర్ స్వాములు ఆకాంక్షించారు. తిరుపతి ఎంతో పవిత్రమైందని భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. గోవిందరాజు స్వామిని ముక్కోటి ద